## 'కన్య' కాదని పెళ్లి రద్దు..



8


— ప్రజా గళమే —

# స్పంద

SPANDHA NEWS

— జాతీయ తెలుగు దినపత్రిక —

Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106








శుక్రవారం || 2-10-2026 || సంపుటి: 1 || సంచిక: 59 || పేజీలు: 8 || వెల: రూ.5/- Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal


## మై-బాప్ సర్కార్ కాదు..
# పౌరుడే ప్రధానం



- యూపీఎస్సీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ కీలక సందేశం
- 'దేశం ముందు.. పౌరుడు ముందు' అనే రెండు ప్రమాణాలే కీలకమని స్పష్టీకరణ

4



# అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే

- ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాల వార్తలపై ఈసీ క్లారిటీ!
- 'సర్' ప్రక్రియపై ప్రతిపక్షాల ఆరోపణలను తిరస్కరించిన ఎన్నికల కమిషన్

4

# జైల్లో పెట్టినా పోరాటం ఆగదు

- సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా కోరుతూ సీజేపీ ఉద్యమ పిలుపు
- అక్టోబర్ 2న ముంబై శివాజీ పార్క్‌లో 'జైల్ భరో ఆందోళన్'

4



## బీసీ రిజర్వేషన్ల కోసం
# సుప్రీం కోర్టుకు!



### 34 శాతం కోటా సాధనపై వెనక్కి తగ్గేది లేదు

- కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకుంటున్న 'గొడ్డలి' పార్టీ
- బాపట్ల జిల్లా రేపల్లెలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ
- గోదావరి తరహాలో సూర్యలంక బీచ్ అభివృద్ధి
- పేదల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

> వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది, భవిష్యత్తులో నిలిచేది తామేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చిచెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు ఆయన ప్రకటించారు. మంగళవారం బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆయన స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం జరిగిన 'ప్రజావేదిక' సభలో సీఎం ప్రసంగించారు.

**రేపల్లె (స్పంద న్యూస్):** నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెస్తే, తాను అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం గుర్తుచేశారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెస్తే, గత 'గొడ్డలి పార్టీ' ప్రభుత్వం దాన్ని 24 శాతానికి కుదించిందని, తద్వారా 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని మండిపడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో ఇస్తే.. ప్రతిపక్షం దాన్ని కోర్టులో సవాల్ చేసిందని విమర్శించారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదన్న వాదనతో కోర్టు ఆ జీవోను కొట్టేసిందని, దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తున్నామని వివరించారు. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వారు.. ఇప్పుడు మెగా డీఎస్సీ వేస్తే దానిపై 350 కేసులు వేసి నియామకాలను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన 28 నెలలుగా ప్రతి ఒకటో తేదీన తాను పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నానని ముఖ్యమంత్రి తెలిపారు. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని తాను విశ్వసిస్తానన్నారు. ప్రతి నెలా 1న పెన్షన్లు, 9న మీ భూమి–మీ హక్కు, మూడో శనివారం

మిగతా 2 లో



# ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెంచాలి

- ఈసీ తీరుపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆందోళన
- కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరా రెడ్డి

కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై, ఓటర్ల జాబితాల సవరణ పేరుతో సాగుతున్న పరిణామాలపై దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్. రఘువీరా రెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

వివరాలు 3లో..



## రాష్ట్రవ్యాప్తంగా సేవా సంకల్ప అభియాన్!

విజయవాడలో బీజేపీ పదాధికారుల సమావేశం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి

3



## చంద్రబాబూ.. బీసీలకు క్షమాపణలు చెప్పండి!

ఎక్స్ వేదికగా చంద్రబాబుపై జగన్ ఫైర్

.. వివరాలు 2లో



# వాట్సాప్‌తో వ్యాపారం

## డ్వాక్రా రుణంతో ఎదిగిన రేపల్లె మహిళ

- సీఎంను ఆకట్టుకున్న జేజమ్మ సక్సెస్ స్టోరీ
- కిరాణా షాపునకు వెళ్లి ముఖాముఖి మాట్లాడిన చంద్రబాబు

2



## పోరాటం ఆగిపోదు

మంత్రి అచ్చెన్నాయుడు

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని వెల్లడి

.. వివరాలు 2లో

# బీసీ రిజర్వేషన్లపై బాబు కొత్త డ్రామా!



- వెన్నుపోటులో ఆయనకు ఆయనే సాటి
- చట్టబద్ధత కల్పించకుండా జీవోలు
- ముఖ్యమంత్రి తీరుపై మండలి విపక్ష నేత బొత్స ధ్వజం

3



## ఆరు వారాల్లో ఎన్నికలు జరపాలి

స్థానిక ఎన్నికలపై ఏపీ హైకోర్టు తీర్పు

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోల రద్దు

3

# పర్యావరణ హాని సహించేది లేదు!

- పరిశ్రమలు నిబంధనలు పాటించి తీరాల్సిందే
- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మన ప్రాథమిక బాధ్యత
- ఆక్వా వ్యర్థాలతో నీటి వనరులను కలుషితం చేస్తే ఊరుకోం
- డిప్యూటీ సీఎం పవన్

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం, సహజ జలవనరులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతని, వాటిని కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

2



# చంద్రబాబూ.. బీసీలకు క్షమాపణలు చెప్పండి!

**రిజర్వేషన్ల పేరుతో ముఖ్యమంత్రి నయవంచన**

**ఎక్స్ వేదికగా చంద్రబాబుపై జగన్ ఫైర్**

**కోర్టుల్లో నిలబడదని తెలిసే డ్రామాలు ఆడుతున్నారు**

**చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగబద్ధంగా మార్గం వెతకాలి**

**కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 34 శాతం రిజర్వేషన్లు సాధించాలి**

**అమరావతి (స్పంద న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నయవంచనతో కూడిన రాజకీయాలు చేస్తున్నారని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా చంద్రబాబును నిలదీశారు. బీసీలను మభ్యపెట్టి ఇంకా ఎన్నాళ్లు మోసం చేయాలనుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు గత తీర్పుల వల్ల 34 శాతం రిజర్వేషన్లు ఏ కోర్టులోనూ నిలబడవని తెలిసే చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. ఏ కోర్టులోనూ నిలబడదని తెలిసీ 44 రోజుల పాటు కపట నాటకం ఆడారని ధ్వజమెత్తారు. జీవోలను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బీసీలకు క్షమాపణలు చెప్పి, లెంపలు వేసుకోవాలని చంద్రబాబును డిమాండ్ చేశారు. నిజంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే.. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి ఆ మేరకు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ఒక మార్గాన్ని తీసుకురావాలని సూచించారు. అలా చేయకుండా రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదన్న విషయం ముఖ్యమంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే దిశగా చంద్రబాబు ఏం చేశారని, కేంద్రంతో మాట్లాడారా అని జగన్ ప్రశ్నించారు. కనీసం కేంద్ర మంత్రులతో అక్కడి కేబినెట్ సమావేశాల్లో ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేశారా అని నిలదీశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు ఎన్నిసార్లు దీనిపై కేంద్రంతో చర్చించారో చెప్పాలన్నారు. ఇవేమీ చేయకుండా, చెల్లని జీవోలు ఇచ్చి డ్రామాలు చేయడం వెనుక ముఖ్యమంత్రి ఉద్దేశం బీసీలను మభ్యపెట్టి మోసం చేయడమేనని స్పష్టం చేశారు. రాజకీయ స్వార్థం కోసం ఆడే డ్రామాలకు బీసీలే దొరికారా అంటూ జగన్ విమర్శలు గుప్పించారు.



# మా పోరాటం ఆగిపోదు

**చివరి వరకూ అండగా ఉంటామన్న మంత్రి అచ్చెన్నాయుడు**

**హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని వెల్లడి**

**అమరావతి (స్పంద న్యూస్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గేది లేదని, ఆ హక్కు కోసం చివరి వరకూ పోరాడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జారీ చేసిన జీవోలను హైకోర్టు కొట్టివేయడం బాధాకరమన్నారు. హైకోర్టు తీర్పుతో బీసీల రాజకీయ హక్కుల కోసం చేస్తున్న పోరాటం ఆగిపోదని మంత్రి తేల్చిచెప్పారు. 34 శాతం రిజర్వేషన్ల కోసం న్యాయపరంగా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ ప్రభుత్వం వినియోగించుకుంటుందని వెల్లడించారు. ఈ క్రమంలోనే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ఆయన ప్రకటించారు. వెనుకబడిన వర్గాలను అధికారంలో భాగస్వాములను చేయాలన్నదే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని, వారికి రాజకీయ అవకాశాలు కల్పించడం తమ పార్టీకి కొత్తేమీ కాదని మంత్రి వివరించారు.



బీసీల రాజకీయ సాధికారత విషయంలో తెలుగుదేశం పార్టీ చరిత్రను ఎవ్వరూ చెరిపేయలేరని అచ్చెన్నాయుడు అన్నారు. 1987లో చట్ట సవరణల ద్వారా పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని గుర్తుచేశారు. ఆ తర్వాత 1995లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్ట సవరణ ద్వారా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లలో బీసీలకు 34 శాతానికి తగ్గకుండా రాజకీయ రిజర్వేషన్ కల్పించే నిబంధన తీసుకొచ్చింది కూడా తమ పార్టీయేనని స్పష్టం చేశారు. 20 శాతం రాజకీయ రిజర్వేషన్ నుంచి 34 శాతం వరకు హక్కు కల్పించిన చరిత్ర తమదేనని ఆయన పేర్కొన్నారు.

### ఏపీ సీడ్స్‌కు రూ.477 కోట్ల బకాయిలు ఎందుకు పెట్టారు?

విత్తనాలపై ఆరోపణలు చేసే ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలకు సమాధానం చెప్పాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. జగన్ భజన పత్రిక సాక్షిలో 'విత్తన గండం' పేరుతో ప్రచురించిన కథనంలో విత్తన సబ్సిడీ, సరఫరాపై చేసిన ఆరోపణలకు వాస్తవాలతో సమాధానం చెబుతున్నామని తెలిపారు. 2018?19లో 50 శాతంగా ఉన్న సెనగ విత్తనాల సబ్సిడీని వైసీపీ పాలనలో 2020?21లో 30 శాతానికి, 2021?22లో 25 శాతానికి ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానిని తిరిగి 35 శాతానికి పెంచిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీని 50 శాతం నుంచి 75 శాతానికి పెంచితే, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి 50 శాతానికి ఎందుకు తగ్గించిందో జగన్ సమాధానం చెప్పాలన్నారు. 2014?19 మధ్య ఏటా సగటున 3.20 లక్షల క్వింటాళ్ల సెనగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందిస్తే, 2019?24 మధ్య ఆ సగటు 1.55 లక్షల క్వింటాళ్లకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2026?27లో సబ్సిడీపై సెనగ విత్తనాల సరఫరాను 1.50 లక్షల క్వింటాళ్ల నుంచి 2.50 లక్షల క్వింటాళ్లకు పెంచుతోందన్నారు. గతంలో రూ.29 కోట్లుగా ఉన్న సెనగ విత్తనాల సబ్సిడీ నిధులను ఈ ఏడాది రూ.78.75 కోట్లకు పెంచామని, సబ్సిడీ శాతంతో పాటు రైతులకు అందించే విత్తనాల పరిమాణాన్ని కూడా పెంచుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2019 నుంచి 2023 మధ్య విత్తన సబ్సిడీకి సంబంధించిన సుమారు రూ.477 కోట్లను ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు చెల్లించకుండా ఎందుకు పెండింగ్‌లో పెట్టారో జగన్ చెప్పాలని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరిస్తూ, ప్రస్తుత విత్తన సరఫరా బిల్లులను చెల్లిస్తూ ఏపీ సీడ్స్ సంస్థను తిరిగి గాడిలో పెడుతోందన్నారు. సాధారణంగా విత్తన సబ్సిడీ కోసం రూ.240 కోట్లు కేటాయిస్తుండగా, ఈ ఏడాది అదనంగా రూ.109 కోట్లు సమకూర్చి మొత్తం సుమారు రూ.348 కోట్ల నిధులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

# బీసీల రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు!

(మొదటి పేజీ తరువాయి..)

స్వచ్ఛాంధ్ర, నాలుగో శనివారం సంజీవని కార్యక్రమాలతో నాలుగు సార్లు నేరుగా ప్రజల ముందుకు వస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వెంటిలేటర్ స్థాయి నుంచి కేంద్ర సహకారంతో ఆక్సిజన్ అందించి గాడిలో పెడుతున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి తోడు 'పీ4' విధానం ద్వారా అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతనిచ్చి వారి జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. పెన్షన్ల కోసమే ఇప్పటివరకు రూ. 76 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు.

### సూర్యలంక ల్యాండ్ మార్క్ కావాలి..

బాపట్లలోని సూర్యలంక బీచ్‌ను పర్యాటకులను ఆకర్షించేలా గోవా తరహాలో అభివృద్ధి చేస్తామని, దాన్ని దేశ చిత్రపటంలోనే ఓ ల్యాండ్ మార్క్‌గా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటించారు. ఈ ప్రాంతంలో అద్భుతమైన పారిశ్రామిక టౌన్‌షిప్ కావాల్సిన వాన్‌పిక్ ప్రాంతాన్ని గత పాలకుడు అవినీతితో సర్వనాశనం చేశాడని, సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నాడని విమర్శించారు. మరోవైపు బుధవారం రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టబోతున్నట్లు వెల్లడించారు. కేంద్రం అమలు చేస్తున్న ఐగాట్-మిషన్ కర్మయోగి ద్వారా ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు 2.2 కోట్ల కోర్సులు పూర్తి చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారని సీఎం ప్రశంసించారు. ఈ సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# వాట్సాప్‌తో వ్యాపారం!

- డ్వాక్రా రుణంతో ఎదిగిన రేపల్లె మహిళ
- సీఎంను ఆకట్టుకున్న జేజమ్మ సక్సెస్ స్టోరీ
- కిరాణా షాపునకు వెళ్లి ముఖాముఖి మాట్లాడిన చంద్రబాబు
- వన్ ఫ్యామిలీఉవన్ ఎంట్రప్రెన్యూర్ స్ఫూర్తితో ముందడుగు
- లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పింఛను పంపిణీ

**రేపల్లె (స్పంద న్యూస్):** స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేపల్లెలోని 4వ వార్డులో ఉన్న శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్‌ను సీఎం సందర్శించారు. దుకాణ యజమాని జి. జేజమ్మతో పాటు ఇతర డ్వాక్రా మహిళలతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. డ్వాక్రా రుణంతో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్న విధానాన్ని జేజమ్మ దంపతులు ముఖ్యమంత్రికి వివరించారు. 2025 ఫిబ్రవరిలో లక్ష రూపాయల పెట్టుబడితో చిన్న దుకాణాన్ని ప్రారంభించగా.. జూన్‌లో రెండు లక్షల గ్రూప్ లింకేజీ రుణం లభించడంతో వ్యాపారాన్ని విస్తరించినట్లు



తెలిపారు. స్మార్ట్ ఫోన్లు, వాట్సాప్ ద్వారా వినియోగదారుల నుంచి నెలవారీ కిరాణా సరుకుల ఆర్డర్లు తీసుకుంటూ నేరుగా ఇంటికే డెలివరీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'వన్ ఫ్యామిలీఉవన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని జేజమ్మ సీఎంకు వివరించారు. తమ వ్యాపార ఆలోచనలు, భవిష్యత్ ప్రణాళికలను డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రికి వివరించారు. వివిధ రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాలను అన్వేషించి మహిళలంతా స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని చంద్రబాబు సూచించారు. వ్యాపారంలో వాట్సాప్ వినియోగంపై ఆయన ఆరా తీశారు. అనంతరం కిరాణా షాపు నిర్వాహకుడు శ్రీనివాసరావు తండ్రి వెంకటరావుకు సీఎం స్వయంగా వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. చివరగా మహిళలతో కలిసి ఫోటోలు దిగారు.







# లక్ష కోట్లతో ఉద్యాన విప్లవం!

**రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం**

**కేంద్ర మంత్రి నిర్మల, సీఎం చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా ప్రారంభం**

**'సీడ్ టు షిప్మెంట్' విధానంతో పండ్ల తోటల పెంపకం**

**మదనపల్లెలో దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

**రిలయన్స్ భాగస్వామ్యంతో రైతులకు అత్యాధునిక సాంకేతికత**

**మదనపల్లె / అమరావతి (స్పంద న్యూస్):** రాయలసీమ ప్రాంతాన్ని దేశానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'కు శ్రీకారం చుట్టింది. విత్తనం నాటిన దగ్గరి నుంచి ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే వరకు (సీడ్ టు షిప్‌మెంట్) రైతులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ఈ బృహత్తర ప్రాజెక్టును రూపొందించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టు పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు.

### రూ. లక్ష కోట్లతో మూడు దశల్లో..

రూ. లక్ష కోట్ల భారీ అంచనా వ్యయంతో మూడు దశల్లో ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పనులు చేపట్టనున్నారు. ఇందులో ఎన్డీఏ ప్రభుత్వం రూ. 40,352 కోట్లు సమకూరుస్తుండగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ. 60,000 కోట్ల మేర పెట్టుబడులు రాబట్టనున్నారు. ప్రభుత్వం కేటాయించే నిధుల్లో సాగునీటి ప్రాజెక్టులకు రూ. 20,884 కోట్లు, ఉద్యాన అభివృద్ధికి రూ. 15,000 కోట్లు, రహదారుల నిర్మాణానికి రూ. 4,562 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కింద అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ కడపతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని 303 మండలాలు, 5,869 గ్రామాల్లో 201 క్లస్టర్లను ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేపడతారు.

### ఉత్పత్తి రెట్టింపు.. రైతులకు మేలు..

ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లు పెంచి 14.41 లక్షల హెక్టార్లకు విస్తరించనున్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల సుమారు 9.6 లక్షల మంది రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. అలాగే కొత్తగా 9 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి రావడంతో పాటు, మరో 4.3 లక్షల ఎకరాలు స్థిరీకరణ కానున్నాయి. మామిడి, అరటి, టమాటా, దానిమ్మతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బెర్రీలు వంటి అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగును ప్రోత్సహించి.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతులకు పెద్దపీట వేయనున్నారు.

### దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్..

హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం దేశంలోనే తొలిసారిగా మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) ఏర్పాటుకు నేతలు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రిలయన్స్ సంస్థ ఈ విద్యా, పరిశోధనా సంస్థ నిర్వహణకు ఏపీ ప్రభుత్వంతో చేతులు కలిపింది. ఆధునిక సాంకేతికత, డిజిటల్ అగ్రికల్చర్, ప్రిసిషన్ ఫార్మింగ్, ఏఐ, మార్కెట్ ఇంటెలిజెన్స్ లాంటి అత్యాధునిక అంశాలపై ఈ సంస్థ రైతులకు, ఎఫ్‌పీవోలకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తుంది. అంతేకాకుండా వ్యవసాయ రంగంలో వినూత్న స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఇంక్యుబేషన్ సెంటర్లను సైతం ఇక్కడ అభివృద్ధి చేయనున్నారు.

# పర్యావరణ హాని సహించేది లేదు!



- పరిశ్రమలు నిబంధనలు పాటించి తీరాల్సిందే
- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మన ప్రాథమిక బాధ్యత
- ఆక్వా వ్యర్థాలతో నీటి వనరులను కలుషితం చేస్తే ఊరుకోం
- సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

**మంగళగిరి (స్పంద న్యూస్):** ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం, సహజ జలవనరులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతని, వాటిని కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణ పట్ల అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. గురువారం మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు పాటించాల్సిన పర్యావరణ అనుసరణలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 128 ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, 82 యూనిట్ల నుంచి నమూనాలు సేకరించి పరీక్షించినట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) మెంబర్ సెక్రటరీ ఈ సమీక్షలో డిప్యూటీ సీఎంకు వివరించారు. వీటిలో 49 యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను పాటించడం లేదని వెల్లడించారు. బీఓడీ స్థాయిలు లీటరుకు 30 మిల్లీగ్రాములు ఉండాల్సి ఉండగా, 321 మిల్లీగ్రాములు నమోదైందని, అలాగే టీఎస్ఎస్ స్థాయిలు 50 మిల్లీగ్రాములకు బదులు 365 మిల్లీగ్రాములు రికార్డయ్యాయని, ఇది ప్రమాదకరమైన పరిస్థితి అని పీసీబీ వివరించింది. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. ఏ పరిశ్రమ అయినా పర్యావరణానికి, సమాజానికి హాని కలిగించేలా యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించడం ఆమోదయోగ్యం కాదన్నారు. కాలుష్యాన్ని మూలాల వద్దే నివారించడం అత్యంత కీలకమన్నారు. ఆక్వా వ్యర్థాల వల్ల నదులు, చెరువులు, భూగర్భ జలాలు కాలుష్య బారినపడకుండా ప్రతి పరిశ్రమా నిర్దేశిత ప్రమాణాలు తప్పక పాటించి తీరాలని ఆదేశించారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లలో ప్రమాణాల అమలును పీసీబీ అధికారులు ప్రతి 15 రోజులకోసారి తప్పనిసరిగా పరీక్షించి, నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

### సమస్యలు ఉంటే చెప్పండి..

నిబంధనలు అమలు చేయడంలో ఏవైనా సాంకేతికపరమైన, నిర్వహణపరమైన సవాళ్లు ఉంటే పరిశ్రమల ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఆ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మత్స్య రంగం, ఆక్వా పరిశ్రమలకు సంబంధించిన సమస్యలపై త్వరలో మత్స్యకార ప్రతినిధులు, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె. ఆనంద్ కుమార్, డి. దిలీప్, యు. జోగి వర్మ, తోట జగదీష్, ఐ. సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

# 3 వరకు 'నేతన్నల సేవలో' లబ్ధిదారుల గుర్తింపు గడువు పెంపు

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్ర సవిత**

**అమరావతి, అక్టోబర్ 1:** రెండో విడత నేతన్నల సేవలో పథకం కింద ఆర్థికసాయం అందించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చురుగ్గా సాగుతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు ఏడో తేదీ నుంచి నేతన్నల సేవలో పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. మొదటి విడతలో 71,536 మందికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. రెండో విడతలో ఆర్థిక సాయం అందించడానికి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 36,632 దరఖాస్తులు వచ్చాయన్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియ గడువు సెప్టంబర్ 30వ తేదీతో ముగిసిందన్నారు. ఇంకా దరఖాస్తుల పరిశీలనతో పాటు, అర్హుల గుర్తింపు పూర్తి చేయాల్సి ఉండడంతో, గడువును వచ్చే నెల మూడో తేదీ వరకూ పెంచినట్లు మంత్రి సవిత తెలిపారు. చేనేత అధికారుల దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టంచేశారు.

# ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెంచాలి

- ఈసీ తీరుపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆందోళన
- 13 కోట్ల ఓట్ల తొలగింపుపై అనుమానాలు
- ప్రతి తొలగింపునకు ఈసీ వివరణ ఇవ్వాలి
- రాహుల్ గాంధీ ప్రశ్నలకు తాజా నివేదికలే నిదర్శనం
- కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరా రెడ్డి డిమాండ్



**విజయవాడ (స్పంద న్యూస్):** కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై, ఓటర్ల జాబితాల సవరణ పేరుతో సాగుతున్న పరిణామాలపై దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్. రఘువీరా రెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గత కొంతకాలంగా ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై లేవనెత్తుతున్న అనేక ప్రశ్నలకు తాజా పరిశోధనాత్మక నివేదికలు మరింత బలం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన కథనం ద్వారా ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలు, ఓటర్ల జాబితాల సవరణపై వ్యక్తమైన అభ్యంతరాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో దాదాపు 13 కోట్లకు పైగా పేర్లను డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయని రఘువీరా రెడ్డి తెలిపారు. ఎన్నికల సంఘం వీటిని తుది తొలగింపులుగా పరిగణించరాదని చెబుతున్నప్పటికీ, ప్రతి తొలగింపునకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ఒక్క అర్హత కలిగిన ఓటరు పేరు కూడా తప్పుగా జాబితా నుంచి గల్లంతు కాకుండా చూడడమే ఈసీ ప్రాథమిక కర్తవ్యమన్నారు. జాబితాలపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసుకునే అవకాశం ప్రతి పౌరుడికి సులభంగా అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు.

### రాష్ట్రాల వారీగా వివరాలు వెల్లడించాలి..

ఎన్నికల సంఘం లాంటి కీలక రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజలకు, రాజకీయ పక్షాలకు సంపూర్ణ నమ్మకం ఉండటం ప్రజాస్వామ్య మనుగడకు అత్యంత కీలకమని రఘువీరా రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంలోనూ పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపు, చేర్పులకు సంబంధించిన పూర్తి డేటాను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా బహిర్గతం చేయాలని కోరారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తొలగించినట్లు చెబుతున్న ఓటర్ల వివరాలను వెంటనే వెల్లడించి, అర్హులైన వారి పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

ఓటు అనేది ప్రతి భారతీయుడి ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని, అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి పక్కకు వెళ్లకుండా కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగబద్ధంగా పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కొలనుకొండ శివాజీ, వి. గురునాథం, కొరివి వినయ్ కుమార్, మేడా సురేష్, అంబటి రామకృష్ణ, బైపూడి నాగేశ్వరరావు, షేక్ ఖుర్షిదా, బొర్రా కిరణ్, జంగా గౌతమ్, నరహరిశెట్టి నరసింహారావు, చిలకా విజయ్ కుమార్, శౌంరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా సేవా సంకల్ప అభియాన్!

- విజయవాడలో బీజేపీ పదాధికారుల సమావేశం
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి
- మోదీ 25 ఏళ్ల పాలనకు 600కు పైగా మెడికల్ క్యాంపులు
- అక్టోబర్ 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సేవా జ్యోతి యాత్ర
- ఏపీకి కేంద్రం చేసిన సాయంపై ప్రజల్లోకి వెళ్తాం



**విజయవాడ (స్పంద న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 7వ తేదీ నుంచి 'సేవా జ్యోతి యాత్ర' ప్రారంభించనున్నట్లు బీజేపీ ప్రకటించింది. విజయవాడలో మంగళవారం ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి అధ్యక్షతన ఆ పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ భేటీకి ఏపీ బీజేపీ ఇన్‌చార్జి అరవింద్ మీనన్, సహ ఇన్‌చార్జి వనితీ శ్రీనివాసన్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సీఎం రమేష్, సుజనా చౌదరి, మాధవ్ సహా తదితర నేతలు హాజరయ్యారు. నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప అభియాన్' నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అరవింద్ మీనన్ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 600కు పైగా మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### ప్రతి ఊరుకి యాత్ర..

అక్టోబర్ 7వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో సేవా జ్యోతి యాత్ర జరుగుతుందని, ప్రతి ఊరిలో ప్రజలు ఈ యాత్రలో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశామని బీజేపీ నేతలు వివరించారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, నిర్మాణం పూర్తి చేయడానికి కేంద్రం భారీ నిధులు సమకూరుస్తోందన్నారు. అలాగే విశాఖలో రైల్వే జోన్, అమరావతి నిర్మాణానికి కూడా నిధులు ఇస్తోందని వివరించారు. మోదీ పాలనపై దేశ ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని, రాహుల్ గాంధీ లాంటి నేతలు కుట్రలు చేసినా ప్రజలు మోదీ వెంటే ఉంటారని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఏపీలో కూటమి అభ్యర్థులే గెలుస్తారని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఏపీలో పాలన సాగుతోందని బీజేపీ నేతలు ఉద్ఘాటించారు.




# ఆరు వారాల్లో ఎన్నికలు జరపాలి!

**స్థానిక సంస్థల ఎన్నికలపై ఏపీ హైకోర్టు సంచలన తీర్పు**

**బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోల రద్దు**

**రిజర్వేషన్లు 50 శాతం మించరాదని ధర్మాసనం స్పష్టీకరణ**

**సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా జీవోలు ఉన్నాయని ఆగ్రహం**

**ఓటర్ల సవరణ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలన్న వైసీపీ పిటిషన్ కొట్టివేత**

**అమరావతి (స్పంద న్యూస్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. రాబోయే 6 వారాల్లోపు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. అదే సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కోర్టు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని తేల్చిచెప్పింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 105, జీవో నంబర్ 1065లను హైకోర్టు ధర్మాసనం పూర్తిగా డిస్మిస్ చేసింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఈ జీవోలు ఉన్నాయని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుపడుతూ, 50 శాతం పరిమితికి లోబడే రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేస్తూ ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. మరోవైపు, రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తిగా ముగిశాకనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా హైకోర్టు కొట్టివేసింది. అన్ని కోణాలను నిశితంగా పరిశీలించిన న్యాయస్థానం, ఎలాంటి ఆలస్యం లేకుండా 6 వారాల్లోపు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పూర్తి స్పష్టత వచ్చినట్లయింది.

# అత్యధికంగా సామాజిక పెన్షన్లను అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ

**రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి**

**నూజివీడు అక్టోబరు 01:** నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో పేదలు సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి కొలుసు పార్థసారథి. ఇంటింటికి వెళ్ళి స్వయంగా లబ్ధిదారులను పలకరిస్తూ పింఛన్ల నగదును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తో కలసి లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులతో మమేకమై వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన విధానం, స్వంత గృహం ఉందా లేదంటే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పింఛన్లు సొమ్మును జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు కొంతమేర పొదుపు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, గ్రామ సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న " పేదలు సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో, జిల్లాలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరుగు చున్నాయని అన్నారు. జిల్లాలో అక్టోబరు నెలలో 2,53,360 మంది ఫించన్లు దారులకు రూ 111.69 కోట్ల రూపాయిలు, నూజివీడు నియోజక వర్గంలో 40,233 మందికి రూ 17.40 కోట్లు, ఒక్క చిన్న గ్రామం పల్లెర్లమూడి గ్రామంలో 670 మందికి రూ 28.72 లక్షలు రూపాయలుపంపిణీ చేస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలకు సకాలంలో పారదర్శకంగా సామాజిక భద్రతా పింఛన్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఒకటవ తేదీ ఉదయాన్నే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి ఇంటి వద్దకే వెళ్ళి నగదును అందజేసేలా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టిందని తెలిపారు. ?పింఛన్ల పంపిణీ ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్నామని, నూరుశాతం పంపిణీ వేగవంతంగా పూర్తి చెయ్యాలని క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పింఛన్లు అందజేయడం జరుగుతుందని, ఒకవేళ మొదటి తేదీ ప్రభుత్వ సెలవు అయితే లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలు సేవలో ఎన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లను ఉదయం 7:00 గంటలు నుండి అందించడం జరుగుతుందని, నూటికినూరుశాతం పింఛన్లు ఈ రోజు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఒక్క రోజు ముందుగానే డబ్బులు డ్రా చేసి 1వ తేదీ ఉదయాన్నే అందిస్తున్నామని, 1వ తేదీ సెలవు దినం అయితే ముందురోజున అందిస్తున్నామని అన్నారు. నిరుపేదలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. ఏ కారణం చేతనైనను ఈ రోజు పింఛన్లు తీసుకోలేని వారికి 02వ తేదీన పంపిణీ చేయబడుతుందని అన్నారు. జిల్లాలో 4925 మంది స్వర్ణవార్డు, స్వర్ణగ్రామ సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బందితో పింఛన్లును పంపిణీకి ఏర్పాటులు చేయడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, నియోజకవర్గం ప్రత్యేక అధికారి రవికుమార్, డిఆర్డిఏ అడిషనల్ పిడి ఇ.అనిత, డియల్డివో పి.అనురాధ, డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి. యన్.సుందరి, తహశీల్దారు షేక్ సంసిద్దీన్, యంపిడివో పి.సాంబశివ రావు, వివిధ శాఖలు అధికారులు, స్వర్ణగ్రామ ఉద్యోగులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై బాబు కొత్త డ్రామా!

**వెన్నుపోటు పొడవడంలో ఆయనకు ఆయనే సాటి**

**ముఖ్యమంత్రి తీరుపై మండలి విపక్ష నేత బొత్స ధ్వజం**

**చట్టబద్ధత కల్పించకుండా జీవోలు ఇవ్వడం దారుణం**

**కేంద్రంలో అధికారంలో ఉన్నా రాజ్యాంగ సవరణ ఎందుకు చేయరు?**

**సుప్రీంకోర్టుకు వెళ్తామనడం బీసీలను మభ్యపెట్టడమేనని విమర్శ**



**తాడేపల్లి (స్పంద న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త డ్రామాలకు తెరతీశారని శాసనమండలి విపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూనే, వాటిని చట్టబద్ధంగా అమలు చేసే దిశగా మాత్రం కూటమి ప్రభుత్వం ఏమాత్రం ముందడుగు వేయడం లేదని విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని, తర్వాత వారిని మోసం చేయడంలో చంద్రబాబుకు ఆయనే సాటి అని బొత్స దుయ్యబట్టారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ పరిమితులను అధిగమించాలంటే అవసరమైన చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అవేమీ చేయకుండా కంటితుడుపు చర్యగా జీవో జారీ చేసి.. ఇప్పుడు అది కోర్టులో వీగిపోగానే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పడం బీసీలను నిలువునా మభ్యపెట్టడమేనని ఆయన మండిపడ్డారు. చంద్రబాబుకు బీసీలకు నిజంగా రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉందని గుర్తుచేశారు. అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పార్లమెంట్‌లో బిల్లు పెట్టి, రాజ్యాంగ సవరణకు కృషి చేయకుండా.. కేవలం బీసీ రిజర్వేషన్ల పేరుతో ఇక్కడ రాజకీయ ప్రచారం చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన నిలదీశారు. ఇది ముమ్మాటికీ వెనుకబడిన వర్గాలను మోసం చేయడమేనని బొత్స తేల్చిచెప్పారు.

# బీసీలకు 34% రిజర్వేషన్ల రక్షణే ప్రభుత్వ లక్ష్యం

**బీసీల రిజర్వేషన్ పై సుప్రీంకోర్టుకు వెళ్తాం**

**మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం, అక్టోబర్ 01:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూనే, బీసీ సామాజిక వర్గాలకు పూర్తి న్యాయం జరిగేలా ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టును ఆశ్రయించబోతున్నామని మంత్రి స్పష్టం చేశారు. 34 శాతం రిజర్వేషన్లకే కట్టుబడి ఉన్నామని,స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 34% రిజర్వేషన్లు అమలు చేయాలనే నిర్ణయానికి తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ద్వారానే క్షేత్రస్థాయిలో నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని నమ్ముతున్నామన్నారు. ఇవి వైసీపీ గొడ్డలి పార్టీ నేతల కుట్రలుగా అభివర్ణించారు. అసెంబ్లీ సాక్షిగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నేతలు కోర్టుకు వెళ్లి కావాలనే అడ్డుకున్నారని మంత్రి మండిపడ్డారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత పెరగకూడదనే కుట్రతోనే 'గొడ్డలి పార్టీ' నేతలు న్యాయస్థానంలో పిటిషన్లు వేసి బీసీలకు తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికలను అడ్డుకోవడమే లక్ష్యంగా వైసిపి కుట్రలు పన్నింది అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగకూడదని, బీసీలకు దక్కాల్సిన పదవులు దక్కకుండా చేయాలనే ఏకైక అజెండాతో ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత వైసీపీ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16,800 మంది బీసీ నేతలు రాజకీయ పదవులను కోల్పోయారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వారికి ఆయా పదవులను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, మళ్లీ ఆ అవకాశాలు రాకుండా కోర్టుల ద్వారా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం రిజర్వేషన్ల అంశం కాదని, ఈ పోరాటం కేవలం సాంకేతిక రిజర్వేషన్ల గురించి మాత్రమే కాదని, బీసీల ఆత్మగౌరవానికి, వారికి దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన జీవన్మరణ సమస్య అని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. బీసీలకు దక్కాల్సిన ప్రతి రాజకీయ అవకాశాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెనకడుగు వేయదని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

# అక్టోబర్ 7 నుంచి 26 వరకు ప్రత్యేక ఎగ్జిబిషన్లు

**సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా ఎంఎస్‌ఎంఈ సదస్సులు**

**విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో సదస్సులు**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**అమరావతి, అక్టోబర్ 1:** విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ (అఎఎ) పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026కు సన్నాహకంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'స్వర్ణాంధ్ర ఏ 2047' లో భాగంగా ప్రాంతీయ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం, సమతుల్య అభివృద్ధి సాధించడం, స్థానిక ఓూఓఇలను పారిశ్రామిక ప్రగతిలో భాగస్వాములను చేయడమే ఈ సదస్సుల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..."గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి 'ఇంటికో పారిశ్రామికవేత్త' (ూనివ ఈజీఎతిశ్రీఎ ూనివ ఇనిబితీవజూతీవనివబీతీ) ఆలోచనకు అనుగుణంగా ఈ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సులు స్థానిక ఎంఎస్‌ఎంఈలకు భారీ పరిశ్రమలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు (ఖూజబ) మధ్య ఒక వారధిగా పనిచేస్తాయన్నారు. ఈ సదస్సులతో యువకులు, మహిళలు, చిన్న పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని మంత్రి వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన విశాఖపట్నం, 12న కాకినాడ, 16న గుంటూరు, 23న అనంతపురం, 26న తిరుపతిలో ఈ సదస్సులు జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రతి సదస్సులో ఓూఓఇ ఎగ్జిబిషన్, బయ్యర్-సెల్లర్ సమావేశాలు, ఓూఓఇ పాలసీ 4.0 రాయితీలు, రుణాలు, ప్రభుత్వ కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
శుక్రవారం, 2 అక్టోబర్ 2026



# 2026 ప్రధాని అభ్యర్థిగా రాహుల్ ఓకేనా?

## 2029 లోక్‌సభ ఎన్నికలపై మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు

## రాహుల్ అభ్యర్థిగా సమర్థిస్తారా? అనే ప్రశ్నకు దాటవేత

## సమయం వచ్చినప్పుడు నిర్ణయిస్తామని కామెంట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని సమర్థిస్తారా? అని మమతా బెనర్జీని ప్రశ్నించిన సమయంలో ఆమె సమాధానాన్ని దాటవేశారు. ఇలాంటి ప్రశ్నలు అడగొద్దని, తామంతా ఒకే కుటుంబమని, సమయం వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటామని ఆమె అన్నారు. ఈ వ్యాఖ్యలతో ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌ను మమతా ప్రస్తుతానికి సమర్థించడం లేదని అర్థమవుతోంది. సమయం వచ్చినప్పుడు ప్రధాని అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకుంటామని గత పదేళ్లుగా తృణమూల్ అధినేత్రి చెబుతూ వస్తున్నారు. ఈసారి కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారంలో ఇండియా కూటమి సమావేశానికి మమతా బెనర్జీ గట్టి మద్దతుదారుగా నిలిచారు. ఇదే సమయంలో బద్ధశత్రువు అయిన సీపీఎం పార్టీతో మమతా కలిసేందుకు సిద్ధమయ్యారు. పశ్చిమ బెంగాల్‌లో ఘోర పరాజయం తర్వాత ఇండియా కూటమిని యాక్టివ్ చేసే చర్యల్లో మమతా బెనర్జీ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఈసీ బీజేపీ గెలుపుకు సహాయపడిందని ఆమె ఆరోపిస్తున్నారు. సెప్టెంబర్ 30న జరిగిన కూటమి సమావేశంలో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆగ్రహంగా మాట్లాడారు. భేటీ తర్వాత ఆమె మాట్లాడుతూ.. అవసరమైతే తాను డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, అఖిలేష్ యాదవ్ తరుపున ప్రచారం చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

# మై-బాప్ సర్కార్ కాదు.. పౌరుడే ప్రధానం

## యూపీఎస్సీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ కీలక సందేశం

### ‘దేశం ముందు.. పౌరుడు ముందు’ అనే రెండు ప్రమాణాలే కీలకమని స్పష్టీకరణ

### ‘పదవి కోసం కాదు.. ప్రజాసేవ కోసం వచ్చే యువతను ఎంపిక చేయాలి’

### వందేళ్ల ప్రస్థానానికి గుర్తుగా స్మారక నాణెం, తపాలా బిళ్ల విడుదల



**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** “ప్రభుత్వమే మై-బాప్ అనే పాత ఆలోచన నుంచి బయటకు రావాలి.. పౌరుడే కేంద్రంగా, పౌరుడి సేవే పరమావధిగా పరిపాలన సాగాలి” అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన శతాబ్ది వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సివిల్ సర్వీసుల ఎంపికలో ‘దేశం ముందు.. పౌరుడు ముందు’ అనే రెండు ప్రమాణాలను ఎప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన సంస్థ శతాబ్ది ప్రస్థానానికి గుర్తుగా ప్రధాని ప్రత్యేక స్మారక నాణెం, తపాలా బిళ్లతోపాటు ప్రభుత్వ సేవా కమిషన్ల విధానాలను ప్రభావితం చేసిన వంద కీలక న్యాయ తీర్పులతో రూపొందించిన పుస్తకాన్ని విడుదల చేశారు.

### తెలివి ఒక్కటే కాదు.. సేవా తపననూ చూడాలి

సివిల్ సర్వీసుల్లోకి వచ్చే అభ్యర్థికి ఎంత పరిజ్ఞానం ఉందన్నది మాత్రమే పరీక్షిస్తే సరిపోదని మోదీ పేర్కొన్నారు. అసలు ఆ యువకుడు లేదా యువతి ప్రజాసేవలోకి ఎందుకు రావాలనుకుంటున్నారు?.. ప్రజా పదవిపై ఆకర్షణతో వస్తున్నారా?.. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో వస్తున్నారా?.. అనే అంశాలను కూడా ఎంపిక విధానం గుర్తించేలా ఉండాలని సూచించారు. “ప్రజా పదవి కోసం కాకుండా ప్రజాసేవ చేయాలన్న తపనతో వచ్చే యువత ప్రభుత్వ సేవల్లోకి రావాలి” అని చెప్పారు. వందేళ్లలో తరాలు మారాయని, ప్రభుత్వాలు మారాయని, సాంకేతికత, పాఠ్యాంశాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ప్రధాని గుర్తుచేశారు. అయినప్పటికీ యూపీఎస్సీపై ప్రజల్లో విశ్వాసం కొనసాగుతోందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత సివిల్ సర్వీసుల్లోకి రావాలన్న ఆకాంక్షతో పరీక్షలకు సిద్ధమవుతున్నారని, అందువల్ల ఈ శతాబ్ది ఉత్సవం సంస్థదే కాకుండా యువత ఆకాంక్షల వేడుక కూడా అని పేర్కొన్నారు. ఇరవై ఒకటో శతాబ్దపు భారతదేశానికి కొత్త పని సంస్కృతి అవసరమని మోదీ అన్నారు. ప్రభుత్వం అన్నింటికీ అధిపతి అన్న ధోరణి కాకుండా ప్రజల అవసరాలు, సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించే పరిపాలనా వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. ‘నాగరిక్ దేవో భవ’ తమ మంత్రమని, పౌరుడి సేవకే అత్యున్నత ప్రాధాన్యం ఉండాలని చెప్పారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పాత్రను ప్రధాని గుర్తుచేశారు. యూపీఎస్సీ శతాబ్ది ప్రదర్శనను పరిశీలించిన సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ సివిల్ సర్వీసుల పరీక్ష రాసిన చారిత్రక సందర్భాన్ని ప్రస్తావించారు. ఇదే కార్యక్రమంలో ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో భారత పైలట్ స్మిత్ మచ్చర్ చూపిన ధైర్యాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన చూపిన సమయస్ఫూర్తి, సాహసం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. మచ్చర్ తల్లిదండ్రులు, భార్యతో తాను మాట్లాడినట్లు వెల్లడించారు. ఆయన ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని, త్వరగా కోలుకోవాలని దేశ ప్రజలు ప్రార్థించాలని కోరారు.

# 3 నెలలు జైల్లో పెట్టినా పోరాటం ఆగదు

- సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా కోరుతూ సీజేపీ ఉద్యమ పిలుపు
- అక్టోబర్ 2న ముంబై శివాజీ పార్క్‌లో ‘జైల్ భరో ఆందోళన్’
- అనుమతి నిరాకరించినా వెనక్కి తగ్గబోమన్న అభిజీత్ దీప్కే



**ముంబై, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** “మూడు రోజులు కాదు.. మూడు నెలలు జైల్లో పెట్టినా మా పోరాటం ఆగదు” అంటూ కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ముంబైలోని శివాజీ పార్క్ వద్ద ‘జైల్ భరో ఆందోళన్’ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అక్కడ నిరసనకు ముంబై పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని సీజేపీ ప్రకటించింది. ముంబైలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దీప్కే మాట్లాడుతూ.. అనుమతి నిరాకరణతో తమ ఉద్యమం ఆగదన్నారు. ముంబై నుంచి ప్రారంభమయ్యే ఆందోళనను దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తామని తెలిపారు. జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయకపోతే అక్టోబర్ చివరి నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఉద్యమం చేపడతామని ప్రకటించారు.

### అనుమతి ఎందుకు ఇవ్వలేదంటే..

శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న సభ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వలేమని ముంబై పోలీసులు నిర్వాహకులకు తెలిపారు. అయితే ఇది కేవలం సీజేపీ నిరసనను అడ్డుకునేందుకు తీసుకున్న నిర్ణయమని చెప్పడానికి ఆధారాలు లేవు. బాంబే హైకోర్టు 2013 నాటి ఉత్తర్వులు, అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం శివాజీ పార్క్‌లో సభలకు అనుమతి ఇచ్చే అధికారం తమకు లేదని పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని అనుమతి కోరాలని సూచించారు. శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలనూ అధికారులు ప్రస్తావించారు. అయినప్పటికీ అదే ప్రాంతంలో అక్టోబర్ 2 సాయంత్రం 4 గంటలకు ‘జైల్ భరో’ నిర్వహిస్తామని దీప్కే ప్రకటించారు. సీజేపీ ప్రతిపాదిత ఆందోళనకు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి కూడా లేదని అధికారులు తెలిపారు.

### సీఈసీ రాజీనామాతోపాటు మూడు డిమాండ్లు

జ్ఞానేష్‌కుమార్ పదవికి రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితాను కొనసాగించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో మరింత పారదర్శకతతోపాటు పౌర సమాజ భాగస్వామ్యానికి అవకాశం కల్పించాలని దీప్కే కోరుతున్నారు. ఇవి సీజేపీ చేస్తున్న రాజకీయ, సంస్థాగత డిమాండ్లు మాత్రమే; జ్ఞానేష్‌కుమార్‌పై నేరపూరిత చర్యలు నిర్ధారణ అయినట్లు ఎలాంటి న్యాయస్థాన తీర్పు వెలువడలేదు.

# అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే

- ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాల వార్తలపై ఈసీ క్లారిటీ!
- ‘సర్’ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆరోపణలను తిరస్కరించిన ఎన్నికల కమిషన్
- గోవా సాంకేతిక లోపం, ఢిల్లీ బేలా ఎస్టేట్ వివాదాలపై స్పష్టత ఇచ్చి ఆరోపణలకు చెక్




**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** ఎన్నికల సంఘం (ఈసీ) ముగ్గురు కమిషనర్ల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు తలెత్తాయంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ఎన్నికల సంఘ వర్గాలు గురువారం స్పందిస్తూ పూర్తి స్పష్టతనిచ్చాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నిర్వహణపై అనేక అనుమానాలు, వివాదాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. 2025 ఫిబ్రవరి 19 నుంచి కమిషన్ తీసుకున్న ప్రతి తుది నిర్ణయం ఏకగ్రీవంగానే జరిగిందని, ఏ ఒక్క కమిషనర్ కూడా విభేదించలేదని ఈసీ వర్గాలు వెల్లడించాయి. నకిలీ, మోసపూరిత, మరణించిన, వేరే ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లను తొలగించడంతో పాటు, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటమే ‘సర్’ ప్రధాన లక్ష్యమని ఈసీ పునరుద్ఘాటించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలపై మిగతా ఇద్దరు కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు గత 10 నెలల కాలంలో 14 సార్లు అధికారికంగా తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారంటూ ‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ ఇటీవల సంచలన కథనాన్ని ప్రచురించింది. అయితే ఈ కథనం వెలువడిన వారం రోజులకు ఎన్నికల సంఘం స్పందిస్తూ.. సీఈసీ తీసుకున్న అన్ని నిర్ణయాలకు మిగతా ఇద్దరు కమిషనర్లు సంపూర్ణ అంగీకారం తెలిపిన తర్వాతే అమలు చేశామని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం ప్రతీ నిర్ణయంలో ముగ్గురు కమిషనర్ల అభిప్రాయానికి సమాన ప్రాధాన్యం ఉంటుందని, ఇద్దరు సమ్మతిస్తేనే అమలు సాధ్యమని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించే ప్రసక్తి ఉండదని నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు. మరోవైపు ‘సర్’ ప్రక్రియలో బీజేపీకి అనుకూలంగా ఓట్లు తొలగిస్తున్నారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేస్తున్న ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు తొలగిపోవడానికి కేవలం సాంకేతిక లోపమే కారణమని, అందులో ఇప్పటికే 88 మంది పేర్లను తిరిగి చేర్చామని వివరించింది. ఢిల్లీలోని బేలా ఎస్టేట్‌లో 727 మంది ఓటర్ల పేర్లు తొలగించారంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ) క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన సమయంలో ఎవరూ అందుబాటులో లేకపోవడం వల్లే ధ్రువీకరణ సంతకాలు పూర్తి కాలేదని క్లారిటీ ఇచ్చింది. దేశవ్యాప్తంగా దాదాపు 25,000 మంది ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ఈ ప్రక్రియలో పారదర్శకంగా పాల్గొంటున్నారని, ఓటర్ల మార్పులు-చేర్పులు అనేవి వికేంద్రీకృత స్థాయిలో జరుగుతాయని వివరించింది. ప్రతిపక్షాలు ముంబై, ఢిల్లీ వేదికలుగా నిర్వహిస్తున్న నిరసనలు రాజకీయ ప్రేరేపితమైనవేనని స్పష్టం చేసింది.

# ఆకాశంలో ఐదుగురు హీరోలు!

### 180 మంది ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో పాటు నలుగురు ఇజ్రాయిల్ పౌరులు

### రెప్పపాటులో విమానం కుప్పకూలకుండా అడ్డుకున్న ధీరులు.. ప్రధాని మోదీ, నెతన్యాహూ ప్రశంసలు



**టెల్ అవీవ్/హైదరాబాద్, అక్టోబర్ 01 (స్పంద న్యూస్):** దుబాయ్ నుంచి ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భయాందోళనకరమైన ఘటనలో 180 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడి భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో పాటు మరో నలుగురు ప్రయాణికులు ప్రపంచవ్యాప్తంగా నిజమైన హీరోలుగా నిలిచారు. బుధవారం గగనతలంలో ప్రయాణిస్తున్న సమయంలో ఓమన్ దేశానికి చెందిన కో-పైలట్ హఠాత్తుగా దాడికి తెగబడటంతో పైలట్ స్మిత్ తీవ్రంగా గాయపడి రక్తమోడారు. ఆ క్లిష్ట సమయంలో సదరు కో-పైలట్ విమానాన్ని కంట్రోల్స్ నుంచి తప్పించడంతో విమానం కేవలం నిమిషంలోపే ఏకంగా 16,000 అడుగుల కిందకు పడిపోయింది. అయితే తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ ధైర్యం వీడని పైలట్ స్మిత్ మచ్చర్, అసామాన్య పోరాటం చేసి కాక్‌పిట్ తలుపులను తెరిచారు. దీంతో ప్రయాణికులు లోపలికి ప్రవేశించి 9/11 తరహా తీవ్ర విపత్తును నివారించగలిగారు. కాక్‌పిట్ తలుపులు తెరుచుకోవడమే ఆలస్యం.. విమానంలో ప్రయాణిస్తున్న నలుగురు ఇజ్రాయిల్ పౌరులు క్షణాల్లో కాక్‌పిట్‌లోకి ప్రవేశించి ఉన్మాదిగా మారిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వృత్తిరీత్యా ప్లంబర్ అయిన యానివ్ హయూన్ వెంటనే స్పందించి, దాడి చేసిన కో-పైలట్‌ను కంట్రోల్స్ నుంచి పక్కకు లాగి, విమానాన్ని స్థిరీకరించేందుకు కంట్రోల్ యోక్‌ను వెనక్కి లాగారు. ఈ సాహసానికి గానూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఆయనతో పాటు అసఫ్ రజువాన్ అనే బిజినెస్ మ్యాన్, బ్యాంక్ లియూమీ అండర్ రైటింగ్ కంపెనీ సీఈఓ జ్వికా మానెస్ కూడా కాక్‌పిట్‌లోకి వెళ్లి నిందితుడిని పట్టుకున్నారు. జ్వికా మానెస్ తన వద్ద ఉన్న హెడ్‌ఫోన్ వైర్లతో కో-పైలట్‌ను గట్టిగా కట్టేయగా, డెంటిస్ట్ డాక్టర్ షోటా ముసాయేవ్ తీవ్రంగా గాయపడిన పైలట్ స్మిత్ మచ్చర్‌కు ప్రథమ చికిత్స అందించి రక్తాన్ని అదుపు చేశారు. దీంతో విమానం సౌదీ అరేబియాలోని ఒక చిన్న విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయ్యే వరకు పైలట్ స్పృహలోనే ఉండగలిగారు.

### పైలట్ మచ్చార్ ధైర్యసాహసాలు దేశానికి గర్వకారణం: ప్రధాని మోదీ

ఈ వీరోచిత ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ పైలట్ స్మిత్ మచ్చార్ ధైర్యసాహసాలను కొనియాడారు. గురువారం స్మిత్ మచ్చార్ భార్య, తల్లిదండ్రులతో ప్రధాని ఫోన్ ద్వారా మాట్లాడి పలకరించారు. శరీరం రక్తమోడుతున్నా ప్రాణాలకు తెగించి పోరాడి కాక్‌పిట్ డోర్ తెరవడం వల్లే 174 మంది ప్రయాణికుల ప్రాణాలు దక్కాయని, విమానయాన చరిత్రలోనే మరొక ఘోర ప్రమాదం త తప్పిందని ప్రధాని పేర్కొన్నారు. ఆయన వైద్య చికిత్సకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను భారత ప్రభుత్వం తరపున అందజేస్తామని భరోసా ఇచ్చారు.

# ఇంద్రకీలాద్రిపై పెత్తనం ఎవరిది?

- దసరా ఉత్సవాల్లో దేవస్థానం పాత్ర ఎంత?..
- ఇతర శాఖల అధికారం ఎంత?
- ఏడాదంతా భక్తుల సేవలో ఉండే ఆలయ ఉద్యోగులు ఉత్సవాల్లో ప్రేక్షకులేనా?
- పోలీసుల 'పెద్దన్న' పాత్రపై భక్తవర్గాల్లో ప్రశ్నలు
- పాలక మండలి, వైదిక సిబ్బందికి నిర్ణయాల్లో మరింత భాగస్వామ్యం కల్పించాలనే డిమాండ్
- ఉత్సవాల ఖర్చులు, శాఖలవారీ కేటాయింపులపై పారదర్శకత కోరుతున్న భక్తులు



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** దసరా అంటే దుర్గమ్మ ఉత్సవం.. ఇంద్రకీలాద్రి అంటే అమ్మవారి క్షేత్రం. మరి శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో కొండపై అసలు పెత్తనం ఎవరిది?.. దేవాదాయ శాఖదా?.. దేవస్థానం పాలక మండలిదా?.. లేక భద్రత, రద్దీ నియంత్రణ పేరుతో రంగంలోకి దిగే ఇతర ప్రభుత్వ శాఖలదా?.. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఏర్పాట్లు ఊపందుకున్న వేళ భక్తవర్గాల్లో ఇప్పుడు ఈ ప్రశ్నలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరిగే దసరా ఉత్సవాలకు 25 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రత, ట్రాఫిక్, పార్కింగ్, పారిశుధ్యం, వైద్యం, తాగునీరు తదితర ఏర్పాట్ల కోసం దేవస్థానం, జిల్లా యంత్రాంగం, పోలీసు, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యం ఇవ్వాలని తాజా సమీక్షల్లోనూ నిర్ణయించారు.

### ఆలయమే కేంద్రం.. మరి ఉద్యోగుల పాత్రేది?

దసరా ఏర్పాట్లలో దేవస్థానం పూర్తిగా పక్కకు తప్పిందని చెప్పడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ఆధారం చూపడం లేదు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఇప్పటికే పలు సమీక్షలు నిర్వహించి, క్యూ లైన్లు, బారికేడ్లు, తాత్కాలిక షెడ్లు, తాగునీరు తదితర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దేవస్థానం పాలక మండలి కూడా దసరా ఏర్పాట్లకు సంబంధించిన 25 అంశాలను చర్చించి ఆమోదించింది. అయితే క్షేత్రస్థాయిలో ఆలయ ఉద్యోగుల అనుభవాన్ని మరింత సమర్థంగా ఉపయోగించుకోవాలన్న అభిప్రాయం భక్తవర్గాల నుంచి వినిపిస్తోంది. ఏడాది పొడవునా కొండపై భక్తుల రాకపోకలు, దర్శన విధానం, అంతరాలయ పరిస్థితులు, క్యూ లైన్ల నిర్వహణను దగ్గరగా చూసే సిబ్బందికి దసరా సమయంలోనూ కీలక బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు. బయటి ప్రాంతాల నుంచి విధులకు వచ్చే సిబ్బందికి ఆలయ భౌగోళిక పరిస్థితులు, వైదిక అవసరాలపై ముందస్తు అవగాహన కల్పిస్తే సమన్వయం మరింత మెరుగవుతుందన్నది వారి వాదన.

### పోలీసుల పని భద్రతే.. దర్శనంపై పెత్తనం వద్దు!

లక్షలాది మంది వచ్చే ఉత్సవాల్లో శాంతిభద్రతలు, ట్రాఫిక్, అత్యవసర పరిస్థితుల నిర్వహణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకం. అదే సమయంలో గర్భాలయ పరిసరాలు, వైదిక కార్యక్రమాలు, దర్శన నిర్వహణ వంటి అంశాల్లో దేవస్థానం, అర్చకులు, అనుభవజ్ఞులైన ఆలయ సిబ్బంది సూచనలకు ప్రాధాన్యం ఉండాలని భక్తులు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రముఖుల దర్శనాల కారణంగా సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తాజా ఏర్పాట్లలో దేవస్థానం కూడా నిర్ణయించింది. ప్రొటోకాల్ దర్శనాలను నియంత్రించి సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఉత్సవాలకు సంబంధించిన ప్రధాన నిర్ణయాల్లో దేవస్థానం పాలక మండలి, వైదిక కమిటీ, అనుభవజ్ఞులైన ఆలయ ఉద్యోగులకు స్పష్టమైన బాధ్యతలు ఉండాలని భక్తులు కోరుతున్నారు. అదే సమయంలో భద్రత, ట్రాఫిక్, పారిశుధ్యం, వైద్యం వంటి అంశాల్లో సంబంధిత శాఖల అధికార పరిధి స్పష్టంగా ఉండేలా సమన్వయ వ్యవస్థ రూపొందించాలని సూచిస్తున్నారు. దసరా కోసం దేవస్థానం ఇప్పటికే క్యూ లైన్లు, తాత్కాలిక షెడ్లు, ప్రసాద వితరణ సహా అనేక పనులను నేరుగా చేపడుతోంది. అందువల్ల 'దేవస్థానం చేతుల్లో ఏమీ లేదు.. మొత్తం పెత్తనం పోలీసులదే' అని నిర్ధారిత వాస్తవంగా చెప్పడం కంటే, వివిధ శాఖల మధ్య అధికార-బాధ్యతల విభజనపై భక్తులు లేవనెత్తుతున్న ప్రశ్నగా వార్తను చూడటం సముచితం. ఉత్సవాల అనంతరం మొత్తం ఖర్చులు, శాఖలవారీ వ్యయం, తాత్కాలిక ఏర్పాట్లకు వెచ్చించిన నిధుల వివరాలను బహిరంగంగా వెల్లడిస్తే మరింత పారదర్శకత వస్తుందని భక్తవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సుప్రీంకోర్టు కెళ్లడం కాదు.. పార్లమెంటులో చట్టం చేయించండి: కేసన శంకరరావు



**మంగళగిరి, అక్టోబర్ 1(స్పంద న్యూస్):** సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి మించాయనే నెపంతో,రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తామన్న 34 శాతం బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను కొట్టేసిన హైకోర్టుకు,ప్రతిగా మళ్లీ ప్రభుత్వం సుప్రీం కోర్టు కెళ్లడం సరికాదని,కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సుప్రీం 50 శాతం పరిమితిని ఎత్తేపించేలా పార్లమెంటు చే చట్టం చేయించి, బీసీలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు.గురువారం స్థానిక రాష్ట్ర కార్యాలయంలో "34 శాతం స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లు- కొట్టేసిన హైకోర్టు తీర్పు" అనే అంశంపై జరిగిన మీడియా సమావేశం లో ఆమేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఎప్పటి నుండో స్థానిక సంస్థలలో అమలవుతూ వస్తున్న 34 శాతం బీసీ రిజర్వేషన్లను,24 శాతమే అమలు చేసి బీసీలకు అన్యాయం చేసిందని కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు విమర్శిస్తూ వచ్చిందన్నారు. దానికి కారణం గత ప్రభుత్వం కాదని,సుప్రీం 50 శాతం పరిమితేనని తెలిసి కూడా,నేటి ఎన్డీఏ ప్రభుత్వం ఆ పరిమితిని ఎత్తేపించేందుకు ఎట్టి చర్యలు గైకొనక పోవడం విచారకరమన్నారు. ఇప్పుడు అదే కారణం చూపి తమ ఎన్నికల వాగ్దానమైన స్థానిక సంస్థల 34 శాతం బీసీ రిజర్వేషన్లను హైకోర్టు కొట్టేస్తే, మళ్లీ తిరిగి ఏ సుప్రీంకోర్టు బీసీ రిజర్వేషన్లకు ఆటంకంగా పరిమితి విధించిందో, అదే సుప్రీంకోర్టుకు ప్రభుత్వం ఇప్పుడు వెళ్తామనడం ఏమాత్రం సహేతుకం కాదన్నారు. అందుకే ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం 50 శాతం పరిమితిని ఎత్తేపించేలా కేంద్రాన్ని ఒప్పించి,ఆయా రాష్ట్రాలలో బీసీల జనాభా దామాషా మేరకు ప్రభుత్వాలు రిజర్వేషన్లు పెంచుకునేలా పార్లమెంటుచే చట్టం చేయించాలని,ఆపై న్యాయపర చిక్కులేవీ రాకుండా రాజ్యాంగం షెడ్యూల్-9 లో పెట్టించి సంపూర్ణ రక్షణ కల్పించాలన్నారు.స్థానిక సంస్థలలో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిత్యం ఉండాలని అన్ని రాజకీయ పార్టీలు అంటూనే,చట్టబద్ధ రిజర్వేషన్లకు సహకరించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో పాలక-ప్రతిపక్షాల సమస్యగా దీన్ని చిత్రీకరించి,ఒకరిపై ఒకరు విమర్శించుకోవడం కాదని,రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల ప్రధాన సమస్యలు-వాటి పరిష్కారాలు అందరికీ తెలిసి కూడా బీసీల జీవితాలతో చెలగాటమాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం తగదన్నారు. అలాగే పార్టీలపరంగా బీసీ రిజర్వేషన్లు కేటాయిస్తామనడం సరికాదని,మా జనాభా దామాషా మేరకు చట్టపరంగా మాత్రమే బీసీ రిజర్వేషన్లు అమలు జరపాలని కోరుతున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరిట 3,4 శాతం కూడా లేని అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇస్తూ కేంద్రం,పార్లమెంటుచే రెండు రోజుల్లో చట్టం చేపించి దేశవ్యాప్తంగా అమలు చేస్తుందన్నారు. అలాగే రాష్ట్ర రాజధాని అమరావతిని మరెవ్వరూ-ఎప్పటికీ మార్చడానికి వీలు లేకుండా ఆగమేఘాల మీద 24 గంటల్లో పార్లమెంటుచే చట్టబద్ధత చేకూర్చారన్నారు. చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ లు తలుచుకుంటే 34 శాతం బీసీ రిజర్వేషన్ల ఏర్పాటు సాధ్యంకానిదేమీ కాదన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే బీసీల అభివృద్ధని నమ్మి, 164 సీట్లు ఇచ్చి గెలిపించిన రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, కేంద్రాన్ని ఒప్పించి స్థానిక సంస్థలలో బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని శంకరరావు పునరుద్ఘాటించారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ దేవళ్ళ వెంకట్, సీనియర్ బీసీ నాయకులు తన్నీరు సాంబయ్య, బొలగాని వెంకట శివరావు గౌడ్, దానా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కూటమి నేతలు

### సామాజిక భద్రతే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు!



**గుంటూరు, అక్టోబర్ 01 (స్పంద న్యూస్):** సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సామాజిక భద్రత పథకాలను అమలు చేస్తోందని ఎన్డీయే కూటమి నాయకులు పేర్కొన్నారు. గురువారం గుంటూరు నగరంలోని 32వ డివిజన్ పరిధిలో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు పాల్గొని పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ పెన్షన్ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. 32వ డివిజన్ పరిధిలోని స్థానిక సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు పెన్షన్లు అందుతున్న తీరును కూటమి నాయకులు దగ్గరుండి పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ 32వ డివిజన్ అధ్యక్షుడు చందు శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు మంగినేని రాము, నగర కార్యదర్శి బొడ్డుపల్లి రాధాకృష్ణ, టీడీపీ నాయకులు, బీజేపీ సీనియర్ నాయకుడు బాల రంగయ్య తదితరులు పాల్గొని పెన్షన్ లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించారు.



# కంతేరులో ఉచిత వైద్య శిబిరం

**తాడికొండ, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** తాడికొండ నియోజకవర్గ కేంద్రంలోని తాడికొండ మండలం కంతేరులో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య జన్మదినోత్సవం సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గుంటూరులోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొత్తం 143 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారికి అవసరమైన తదుపరి వైద్య సేవలను ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా అందిస్తామని వైద్యులు రాజశేఖర్, అఖిల్ తెలిపారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు, పాల్ బాబు, బ్రహ్మనాయుడు, ఇమ్మానియేలు, విజయరావు, బడే బాయ్, అజితేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఇరికేపల్లిలో ఉచిత మెగా గుండె వైద్య శిబిరం



**దాచేపల్లి, అక్టోబరు 1(స్పంద న్యూస్):** ది మదర్ స్వచ్ఛంధ సేవా సంస్థ, విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి లో ఉచిత మెగా గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ది మదర్ స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షురాలు నాగెండ్ల సుమతీ రత్నం గురువారం తెలిపారు. ఇరికేపల్లి లోని నాగెండ్ల రత్నం కాంప్లెక్స్ లో ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, వైద్య శిబిరం లో విజయవాడ స్వర హాస్పటల్స్ కు చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అయాసం, గుండెదడ, గుండెనొప్పి తో పాటు ధీర్ఘ కాలంగా షుగర్, బిపితో భాధపడుతున్న వారికీ బిపి, ఇసిజీ, ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని సుమతీ రత్నం తెలిపారు. దాచేపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చెట్టినాడ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**దాచేపల్లి, అక్టోబరు 1(స్పంద న్యూస్):** చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్,దాచేపల్లి యూనిట్,ఆకాశం హాస్పిటల్స్, గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తుమ్మలచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఆకాశం హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ దాచేపల్లి యూనిట్ హెడ్ సీతారాములు, హెచ్ఆర్ హెడ్ బి.వి.ఆర్. రాజు, అధేవిదంగా ఆకాశం హాస్పిటల్స్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. తుమ్మలచెరువు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో వైద్య శిబిరం లో పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రజారోగ్య రక్షణ కోసమే

### స్వచ్ఛ యాప్ ద్వారా ఉల్లంఘనలకు జరిమానాలు



**గుంటూరు, అక్టోబర్ 1 (స్పంద న్యూస్ ):** ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని నిషేధించినట్లు కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. నిషేధం అమలుకు వార్డుల వారీగా ప్రత్యేక బృందాలతో రోజువారీ తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఉల్లంఘనలకు స్వచ్ఛ యాప్ ద్వారా జరిమానాలు విధిస్తున్నామని చెప్పారు. యూఎన్ఈపీ ఆధ్వర్యంలో జీఎంసీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన వర్క్‌షాప్‌లో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలపై చర్చించారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రత్యామ్నాయ వస్తువులను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో యూఎన్ఈపీ ప్రతినిధి డాక్టర్ సుమిత్ శర్మ, కౌశిక్ చంద్రశేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ బాబు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి స్పంద జాతీయ తెలుగు దినపత్రిక
శుక్రవారం, 2 అక్టోబర్ 2026

# 5 వేల మంది మహిళలతో శ్రీ విద్యా కుంకుమార్చన మహా యజ్ఞం

- దేశ ప్రగతి, ప్రపంచ శాంతి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా కార్యక్రమం
- శ్రీలలితా సహస్రనామ మంత్రాలను కోటి సార్లు జపిస్తామని ప్రతిజ్ఞ





**తాడేపల్లి, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** కొలనుకొండ తాడేపల్లిలోని కంచి కామకోటి పీఠం ఆడిటోరియంలో దేశ ప్రగతి, ప్రపంచ శాంతి, పేదల సంక్షేమం లక్ష్యంగా శ్రీ విద్యా దశకోటి కుంకుమార్చన మహా యజ్ఞం నిర్వహించారు. నిర్వాహకుల ప్రకారం, 5 వేల మందికి పైగా మహిళలు, భక్తులు పాల్గొని శ్రీ లలితా సహస్రనామ మంత్రాలను కోటి సార్లు జపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్వామి అభిషేక్ బ్రహ్మచారి, ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, యువ చేతన జాతీయ కన్వీనర్ రోహిత్ కుమార్ సింగ్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి అభిషేక్ బ్రహ్మచారి మాట్లాడుతూ దేశ ప్రగతి, ప్రజా సంక్షేమం, సనాతన ధర్మ సాధికారత కోసం దేశంలోని వివిధ జిల్లాల్లో శ్రీ విద్యా కుంకుమార్చన మహా యజ్ఞాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సనాతన ధర్మ జ్యోతిని విస్తరించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. రోహిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఐక్యత కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శారద, రోహిత్ చౌదరి, జగ్మోహన్ రెడ్డి, జగ్నేష్ రావు, శివపాల్ యాదవ్, ముఖేష్ యాదవ్, చైతన్య, కోమ, ఆదిత్య చౌబే తదితరులు పాల్గొన్నారు.



# క్షయ వ్యాధి అంతంలో ప్రజలు సహకరించాలి

## డాక్టర్ పల్లికొండ రవికుమార్

**తెనాలి, అక్టోబరు 1 (స్పంద న్యూస్):** కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన " సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా గురువారం కఠెవరం గ్రామంలోని శాంతినగర్ నందు ఏర్పాటుచేసిన ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా తెనాలి టీబీ యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన మరియు స్క్రీనింగ్ కార్యక్రమాలు కూడా చేస్తున్నామని , క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ఉచితంగా కళ్లెపరీక్షతోపాటు, క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితం గా మందులు ఇవ్వడం జరుగుతుందని, అనుమానిత క్షయవ్యాధి గ్రస్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, క్షయ వ్యాధి అంతంలో గ్రామ ప్రజలు సహకారం ఎంతైనా అవసరం ఉందని తెలిపారు. క్షయ వ్యాధి ఒకరినుండి మరొకరికి గాలి ద్వారా మాత్రమే సంవత్సరానికి 10 నుండి 15 మందికి వ్యాప్తి చెందుతుందని క్షయ వ్యాధి వస్తే రెండు వారాల మించి దగ్గు రెండు వారాల మించి జ్వరం , దగ్గినప్పుడు కళ్లెలో రక్త చార కనబడటం, బరువు తగ్గిపోవటం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆయాసం, నీరసం, శరీర భాగాల్లో కణితలు వంటివి కనిపించడం ఇలాంటి లక్షణాలలో ఏ ఒక్కటి ఉన్నా క్షయ వ్యాధిగా అనుమానించి దగ్గర్లోని గవర్నమెంట్ హాస్పటల్ కి వెళ్లాలన్నారు. ఎలిమెంటరీ స్కూల్ హెడ్ మాస్టర్ హెరోన్స్ మాట్లాడుతూ "ఆరోగ్యమే–మహాభాగ్యమని" గనుక ప్రజలందరూ అశ్రద్ధ వహించకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఒ. కుటుంబ రెడ్డి, ఏఎన్ఎం అనురాధ,ఆశా కార్యకర్తలు రమాదేవి,పద్మజ, లక్ష్మీరాజ్యం, సునీత అంగన్ వాడి టీచర్ రోజ్ మేరీ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేడు స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ బహూకరణ : కలెక్టర్



**గుంటూరు, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణలో విశేష కృషి చేసిన వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్–2026' ప్రధానోత్సవాన్ని నేడు(శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ వెల్లడించారు. గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఆర్.ఆర్.ఆర్ (రిడ్యూస్–రీయూజ్–రీసైకిల్) విధానం, సుస్థిర పర్యావరణ పద్ధతులను సమర్థవంతంగా అమలు చేసిన స్థానిక సంస్థలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు ఈ పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ 'స్వచ్ఛ సర్వేక్షణ్' ప్రాతిపదికన దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 26 విభాగాల్లో ఈ సమగ్ర స్వచ్ఛత సర్వేను నిర్వహించిందని కలెక్టర్ కొనియాడారు. ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియ స్వీయ మూల్యాంకనం, జిల్లా స్థాయి అధికారుల ధృవీకరణ, థర్డ్ పార్టీ అసెస్మెంట్ అనే మూడు పారదర్శక దశల్లో పూర్తిగా SASA పోర్టల్ మరియు మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో పూర్తయిందని తెలిపారు. స్వీయ మూల్యాంకనంలో పాల్గొన్న 1,58,933 కేంద్రాలలో జిల్లా స్థాయి ధృవీకరణ అనంతరం 1,960 ఎంట్రీలు నామినేట్ కాగా, చివరకు 101 ఎంట్రీలు రాష్ట్ర స్థాయి అవార్డులకు పోటీపడ్డాయని వివరించారు. అక్టోబర్ 2న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో విజేతలను ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. జిల్లా నుంచి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎంపికైన విజేతల పూర్తి వివరాలు SASA పోర్టల్ (https://sasa.ap.gov.in/) లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవార్డుల ప్రకటనలో వివిధ విభాగాల్లో ఎంపికైన ప్రధాన విజేతల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా వడ్లమూడి, సీతారాంపురం, పొన్నెకల్లు, నందివెలుగు నిలవగా; స్వచ్ఛ బస్ స్టేషన్‌గా మంగళగిరి బస్ స్టాండ్, రైతు బజార్‌గా తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతు బజార్, పర్యాటక ప్రదేశంగా ఉండవల్లి గుహలు, ఆధ్యాత్మిక ప్రదేశంగా వెంకటపాలెం టిటిడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎంపికయ్యాయి. అలాగే ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పరిషత్, జిల్లా అటవీ శాఖ కార్యాలయాలు పురస్కారాలకు ఎంపికయ్యాయి. పారిశుధ్య సేవలందించిన మేకల జాలయ్య, అల్లం శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి గురుమూర్తి, పొట్నూరి సాంబయ్య, గండికోట సీతయ్యలకు 'స్వచ్ఛ వారియర్స్' అవార్డులు, అలాగే పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన చింత అలేఖ్య, రేటూరి వేణు, వంకాయలపాటి శోభ, చిలక యేసు మరియమ్మ, గొడవర్తి నాగరాజులకు 'స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్లు'గా గుర్తింపు దక్కింది. స్వచ్ఛ ఆంధ్ర విజేతలందరినీ అభినందిస్తూ, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ ఈ స్వచ్ఛత ఉద్యమంలో సమష్టి భాగస్వాములు కావాలని కలెక్టర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు.

# స్కూల్ బస్సుల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



**దుర్గి, అక్టోబర్ 01 (స్పంద న్యూస్):** దుర్గి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై బి. గోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల స్కూల్ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు, సురక్షిత డ్రైవింగ్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత అని, విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరూ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. గోపాల్ మాట్లాడుతూ.. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనం నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడటం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రయాణ సమయంలో సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, పరిమితికి మించి విద్యార్థులను బస్సులో ఎక్కించుకోకూడదని ఆదేశించారు. అలాగే వాహనాల ఫిట్‌నెస్, ఇతర భద్రతా ప్రమాణాలను క్రమం తప్పకుండా పరిశీలించుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత అందరి బాధ్యత అని, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## తమ భూములను స్వాధీనం చేసుకునేందుకు

# కదలిన ఆర్అండ్‌బి అధికారులు





**కారంపూడి, అక్టోబర్ 1( పల్నాడు జిల్లా ) స్పందన న్యూస్ :** కారంపూడి మండలంలో జాగా కనిపిస్తే జెండా పాతెయ్ అన్న రీతిగా 2019 నుండి విచ్చలవిడిగా ప్రభుత్వ, దేవస్థానాల ఈనాం భూములను, పోరంబోకులను, ఆర్ అండ్ బి శాఖ వారి భూములను,ఎన్ఎస్పి భూములను ఆక్రమించుకొని, వెంచర్లు వేయటం, షాపులు నిర్మించుకుని అద్దెలకివ్వటం, ఏకంగా పెద్ద పెద్ద భవంతులను నిర్మించటం చేస్తున్న అటు ఆయా శాఖలవారు కానీ, ఇటు పంచాయతీ అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలను ఎదుర్కొంటున్నారు. వీటన్నిటిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను ఆయా శాఖల వారు, వారి భూములను స్వాధీనం చేసుకొనవలసిందిగాను ఆర్ అండ్ బి రహదారిని ఎక్స్టెన్షన్ చేస్తూ చర్యలు తీసుకోవలసినదిగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలిస్తూ, పదేపదే ఆయా శాఖల వారిని హెచ్చరించినను చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ఎట్ట కేకలకు ఆర్ అండ్ బి అధికారులు మద్దునిద్ర నుండి మేల్కొని గురువారం మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో గురజాల, మాచర్ల రోడ్ల కూడలిలో తమ హద్దులను తెలుపుతూ ఆయా ఆక్రమితదారుల గృహాలకు, ఇతర వారి గోడలపై హద్దులు తెలిపే విధంగా గుర్తులు పెట్టి, పంచాయతీ వారిని ఆయా ఆక్రమితదారులకు అందరకు తమ గృహాలను, మరియు వ్యాపార షాపులను ఖాళీ చేసుకుని, వాటిని తొలగించుకోవలసినదిగా నోటీసులు జారీ చేయమని ఆదేశాలు ఇచ్చి వెళ్లారు. ఇప్పటివరకు ఆర్ అండ్ బి స్థలాలను, పంచాయతీ పరిధిలో ఉన్న పంచాయతీ భూములను ఆక్రమించుకుని వెంచర్లు వేస్తున్న చూస్తూ ఉండిపోయిన పంచాయితీ సిబ్బంది,అధికారులు ఇప్పుడు తప్పనిసరిగా చర్యలు తీసుకునే విధంగా ఆర్ అండ్ బి అధికారులు కల్పించారు. కారంపూడి నుండి దాచేపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో రహదారికి మూడు అడుగుల దూరం వరకు భవనాన్ని నిర్మించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకొని పంచాయతీ మరియు ఆర్ అండ్ బి అధికారులపై కారంపూడి పట్టణ ప్రజలు విమర్శలు చేసిన, నవ్విపోదురు గాని నాకేంటి అన్న రీతిలో పంచాయతీ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఆ భవన యజమాని వద్ద నుండి ఇరు శాఖల వారు కొంత సొమ్మును కూడా లంచాల రూపేనా తీసుకున్నారని కూడా ఘాటైన విమర్శలు వినవస్తున్న పట్టించుకునే వారే లేకుండా పోయారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ఆర్ అండ్ బి స్థలాలను స్వాధీనం చేసుకొనుటకు సమాయత్తమవుటం హర్షించదగ్గ విషయమని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కారంపూడి పట్టణంలో పంచాయతీ ఆఫీస్ వద్ద నుండి చెక్‌పోస్ట్ వరకు ఆయా షాపుల వారు తమకు వచ్చిన సరుకును దిగుమతి చేసుకునే నిమిత్తం రోడ్డు పైనే వాహనాలను ఆపడంతో సాధారణ ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడిన కొన్ని సందర్భాలలో పోలీసు ఉన్నతాధికారులు, శాసనసభ్యులు ఇరుక్కుపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని పట్టణ ప్రజలు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్ అండ్ బి మరియు పంచాయతీ అధికారులు ఈ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేసి ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలను తొలగించవలసినదిగా కోరుతున్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మోతే శేషగిరి

## నియామక పత్రం అందజేసిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు

**గుంటూరు, అక్టోబర్ 1 (స్పంద న్యూస్ ):** బీజేపీ ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా మోతే శేషగిరిని నియమించారు. గుంటూరులోని వాజ్‌పేయి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆయనకు నియామక పత్రాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అందజేశారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ జిల్లాలో ఓబీసీ మోర్చాను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, సీనియర్ నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. శేషగిరికి ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ తుల్లిమిల్లి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చరక కుమార్ గౌడ్, రాష్ట్ర మీడియా కన్వీనర్ రాకేష్ జీతో పాటు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.



## ప్రజల అభీష్టానికి అనుగుణంగా

# ప్రభుత్వ పనితీరు

## దాచేపల్లిలో ఎమ్మెల్యే యరపతినేని పెన్షన్లు పంపిణీ

**దాచేపల్లి, అక్టోబరు 1(స్పంద న్యూస్ ).** ప్రజల అభీష్టానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, తద్వారా ఈ రెండున్నర ఏళ్ళ లో కూటమి ప్రభుత్వం పనితీరు వలన 3.5 శాతం ఓటింగ్ పెరిగిందని పల్నాడు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీ లోని జలగడ బజార్ లో వృద్ధులకు ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులతో ప్రజల ప్రభుత్వం పట్ల అనుకూల అభిప్రాయం ఏర్పడిందని దీంతో కూటమి కి 3.5 శాతం ఓట్లు పెరిగాయన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి కి అనుకూలంగా ఉందని, నియోజకవర్గం లోని మూడు మున్సిపాలిటీల్లో కూటమి గెలుస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరని యరపతినేని తెలిపారు. అనంతరం దాచేపల్లి లో అత్యాధునిక హంగులతో నిర్మించిన ఈ బస్సు బేని యరపతినేని పరిశీలించారు. ఈ బస్సు బే లో బస్సు షెల్టర్‌తో పాటు, ఉచిత వైఫై, అత్యాధునిక టాయిలెట్స్ ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. త్వరలో ఈ బస్సు బే ను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గురజాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ బెల్లంకొండ భారతి, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి కోటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు తోట వెంకటేశ్వర్లు, అక్కినపల్లి బాలయ్య, తంగెళ్ళ శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, మునగా నిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక






# హైవోల్టేజ్ గేమ్‌లో నెగ్గిన ఇండియా..

## హాకీ సెమీస్‌లో పాక్‌పై విక్టరీ

**కాకామిఘర:** డిఫెండింగ్ చాంపియన్స్ ఇండియా .. ఏషియన్ గేమ్స్ పురుషుల హాకీ ఫైనల్లోకి ప్రవేశించింది. ఇవాళ జరిగిన సెమీఫైనల్లో ఇండియా 4-3 గోల్స్ తేడాతో ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయం సాధించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 5, 13వ నిమిషాల్లో వచ్చిన రెండు పెనాల్టీ కార్నర్లను అద్భుతంగా గోల్స్‌గా మలిచాడు. ఇక ఆట 23వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ ఓ గోల్ చేశాడు. ఆట చివరి నిమిషాల్లో అభిషేక్ ఫీల్డ్ విన్నింగ్ గోల్ చేసి భారత బృందంలో ఆశలు రేపాడు. పాకిస్థాన్ జట్టు తరపున అబూ మహమూద్ 30వ నిమిషంలో, హనన్ షాహిద్ 45వ నిమిషంలో వాహిద్ రాణా 49వ నిమిషంలో గోల్స్ చేశారు. సెమీస్ మ్యాచ్‌లో ఆరంభం నుంచి ఇండియా ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్‌లు ప్రారంభంలోనే గోల్స్ చేయడంతో పాక్ టెన్షన్‌లో పడింది. కానీ సెకండ్ ఆఫ్‌లో అనూహ్య రీతిలో పాకిస్థాన్ పుంజుకుని .. ఇండియాను కొంత ఆందోళనకు గురి చేసింది. అయితే చివరి నిమిషాల్లో అభిషేక్ ఇండియాను ఓటమి నుంచి తప్పించాడు. సెకండ్ హాఫ్‌లో పాక్ ఫార్వర్డ్ ఆటగాళ్లు దూకుడు గేమ్‌ను ప్రదర్శించారు.ఆట 5వ నిమిషంలోనే హర్మన్‌ప్రీత్ తన పవర్‌ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్ చేశాడు. ఇండియాకు ఫస్ట్ లీడ్ ఇచ్చాడు. ఆ తర్వాత 13వ నిమిషంలో మరో గోల్ చేసి ఇండియాను ఆధిక్యంలో నిలిపాడు. ఇండియా అటాకింగ్ గేమ్ ఆడడంతో.. ఫస్ట్ క్వార్టర్‌లో పాకిస్థాన్ ఆ ధాటిని తట్టుకోలేకపోయింది. 23వ నిమిషంలో సుఖ్‌జీత్ గోల్ కొట్టడంతో ఇండియాకు 3-0 లీడ్ వచ్చింది. కానీ హాఫ్ టైంకు 35 సెకండ్ల ముందు పాకిస్థాన్‌కు పెనాల్టీ కార్నర్‌తో గోల్ వచ్చింది. రెండో హాఫ్‌లో 3-1 తేడాతో వెనుకబడ్డ పాకిస్థాన్.. దూకుడు గేమ్ ఆడింది. 49వ నిమిషంలో హనన్ ఈక్వలైజర్ గోల్ చేసి 3-3తో ఆటపై ఆసక్తిని పెంచాడు. ఇక షూటౌట్ తప్పదు అనుకున్న సమయంలో.. ఆట ముగియడానికి 45 సెకండ్ల ముందు అభిషేక్ గోల్ చేసి పాకిస్థాన్‌ను స్టన్ చేశాడు. దక్షిణ కొరియా, మలేషియా మధ్య జరిగిన మ్యాచ్‌లో గెలిచిన జట్టుతో ఇండియా ఫైనల్లో గోల్డ్ మెడల్ కోసం పోటీపడనున్నది.

# 405 చూసి కంగారుపడ్డా

## గెలుస్తామా అనిపించింది!

### భారీ లక్ష్యాన్ని చూసి సందేహం కలిగిందన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్



**గువాహటి, అక్టోబర్ 1 (సమయం న్యూస్):** "స్కోరు బోర్డుపై 405 పరుగులు కనిపించగానే కాస్త కంగారుపడ్డా. ఇంత భారీ లక్ష్యాన్ని ఛేదించడం అంత సులభం కాదనిపించింది. గెలుస్తామా అనే సందేహం కూడా వచ్చింది. కానీ ఒక్కసారి బ్యాటింగ్ మొదలయ్యాక అంతా మా ప్రణాళిక ప్రకారమే సాగింది" అని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ 43.3 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించిన అనంతరం గిల్ తన ఇన్నింగ్స్, జట్టు వ్యూహాన్ని వివరించాడు. ఈ మ్యాచ్‌లో 133 బంతుల్లో 26 ఫోర్లు, 8 సిక్సర్లతో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్ భారత చారిత్రాత్మక ఛేదనలో కీలకపాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనకు అతడికి మ్యాచ్ ఉత్తమ ఆటగాడి అవార్డు దక్కింది. గువాహటిలోని వేడి, ఉక్కపోత తమను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయని గిల్ తెలిపాడు. "మధ్యాహ్నం వేడి చాలా ఎక్కువగా ఉంది. శరీరంలోని దాదాపు ప్రతి భాగంలోనూ కండరాలు పట్టేశాయి. వెస్టిండీస్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతున్నప్పుడు 13 ఓవర్లకే 20--25 ఓవర్లు ఫీల్డింగ్ చేసినంత అలసటగా అనిపించింది. అయినా మా ఫీల్డర్లు అద్భుతంగా కదిలారు" అని చెప్పాడు. "వికెట్ ఎంత బాగున్నా.. మైదానం ఎంత చిన్నదైనా 406 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో ఒత్తిడి తప్పదు. ఒక దశలో విజయం సాధించగలమా అనే సందేహం వచ్చింది. అయితే బ్యాటర్లు అద్భుతంగా స్పందించారు. చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించడం చాలా సంతోషంగా ఉంది. రోహిత్ భాయ్ నాకు ఎంతో సహకరించాడు" అని గిల్ పేర్కొన్నాడు. తన ఫామ్ వెనుక ప్రత్యేకమైన రహస్యమేమీ లేదని గిల్ చెప్పాడు. భారీ లక్ష్యాన్ని ఒకేసారి చూడకుండా ఇన్నింగ్స్‌ను చిన్న చిన్న భాగాలుగా విభజించుకుని ఆడటమే తమ వ్యూహమని వివరించాడు. పవర్‌ప్లేలో వికెట్ కోల్పోకుండా 75 నుంచి 80 పరుగులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు. "కొత్త బంతితో కొంత స్వింగ్ ఉ ంటుందని తెలుసు. బంతి పాతబడిన తర్వాత బ్యాటింగ్ మరింత సులభమవుతుందని భావించాం. మైదానంలో ఒకవైపు బౌండరీ చిన్నగా ఉండటంతో పేసర్లు బౌలింగ్ చేసినప్పుడు ఆ వైపును లక్ష్యంగా చేసుకున్నాం. 25 ఓవర్లకు 200-210 పరుగులుంటే మంచి స్థితిలో ఉంటామని అనుకున్నాం. కానీ 230-240 వరకు వెళ్లగలిగాం. మధ్యలో వికెట్లు పడకపోవడం మాకు మరింత కలిసొచ్చింది" అని గిల్ వివరించాడు. తొలి పవర్‌ప్లేలో భారత బౌలింగ్ ఆశించిన స్థాయిలో లేదని గిల్ అంగీకరించాడు. ఒక దశలో వెస్టిండీస్ 420-430 పరుగులు చేసేలా కనిపించిందని, అయితే చివరి ఓవర్లలో బౌలర్లు పుంజుకుని పరుగులను నియంత్రించారని చెప్పాడు. సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించిన నేపథ్యంలో మూడో వన్డేలో ఇప్పటివరకు అవకాశం దక్కని ఆటగాళ్లకు చోటు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపాడు.

# టీ20ల్లో టీమిండియా నయా రికార్డు

## ప్రపంచంలోనే ఏకైక జట్టుగా ఘనత!

### ఆసియా క్రీడల్లో శ్రీలంకను చిత్తు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

### 100+ పరుగుల తేడాతో అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా రికార్డు సృష్టి



**నాగోయా/హైదరాబాద్, అక్టోబర్ 1 (సమయం న్యూస్):** జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు (ఏషియన్ గేమ్స్) 2026 పురుషుల క్రికెట్ టోర్నీలో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. గురువారం శ్రీలంకతో జరిగిన తొలి సెమీఫైనల్ పోరులో భారత్ ఏకంగా 124 పరుగుల ఆధిపత్య తేడాతో ఘన విజయం సాధించి, పసిడి పతక పోరు (ఫైనల్)కు అర్హత సాధించింది. ఈ చారిత్రాత్మక విజయంతో పురుషుల అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో 100 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో అత్యధిక విజయాలు నమోదు చేసిన తొలి ప్రపంచ జట్టుగా భారత్ తన రికార్డును మరింత సుదృఢం చేసుకుంది.

**రికార్డుల మోత - కెనడాను దాటి అగ్రస్థానానికి:**

శ్రీలంకపై సాధించిన ఈ విక్టరీతో టీమిండియా టీ20ల్లో 100కు పైగా పరుగుల మార్జిన్‌తో గెలవడం ఇది 11వ సారి కావడం విశేషం. ఈ జాబితాలో ఇప్పటివరకు 10 విజయాలతో భారత్‌తో సమానంగా ఉన్న కెనడాను వెనక్కి నెట్టి టీమిండియా ఒంటరిగా అగ్రస్థానానికి చేరుకుంది. ఇక 9 విజయాలతో ఆస్ట్రియా మూడో స్థానంలో ఉంది. దీనికితోడు టీ20 టోర్నమెంట్లలో రెండు ప్రధాన (పూర్తి సభ్యత్వ) దేశాల మధ్య జరిగిన సెమీఫైనల్ లేదా ఫైనల్ మ్యాచ్‌లలో ఇది అత్యంత భారీ విజయ మార్జిన్‌గా నిలిచింది. గతంలో 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత్ సాధించిన 96 పరుగుల విజయ రికార్డును ఈ 124 పరుగుల గెలుపు దాటేసింది.

**మ్యాచ్ విశేషాలు**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 169 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. అనంతరం 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు ఆరంభం నుంచే చుక్కలు చూపించారు. కరచరణాలిక వేగంతో వరుసగా వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక బ్యాటర్లు ఏ దశలోనూ కోలుకోలేకపోయారు. దీంతో లంక ఇన్నింగ్స్ 9.5 ఓవర్లలో కేవలం 45 పరుగులకే కుప్పకూలింది. ఈ దెబ్బతో 124 పరుగులతో గ్రాండ్ విక్టరీ కొట్టిన భారత జట్టు ఫైనల్ చేరింది. గత ఆసియా క్రీడల్లో సాధించిన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అడుగులేస్తున్న టీమిండియా, శనివారం జరగబోయే తుది పోరులో పసిడి పతకం కోసం పోటీపడనుంది.

# డబుల్ సెంచరీల 'దాదా' రోహిత్..

## వెంటపడుతున్న గిల్!

### వన్డేల్లో ద్విశతకాలతో చరిత్రకెక్కిన ఐదుగురు భారత బ్యాటర్లు

### మూడు డబుల్ సెంచరీలతో ఇప్పటికీ రోహిత్ శర్మదే ప్రత్యేక రికార్డు

### రెండో ద్విశతకంతో రోహిత్ తర్వాతి స్థానంలో శుభ్‌మన్ గిల్

### 264 పరుగులతో వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు రోహిత్‌దే

### సచిన్‌తో మొదలైన భారత '200' కథ.. గిల్‌తో మరో అధ్యాయం



**గువాహటి, అక్టోబర్ 1 (సమయం న్యూస్):** వన్డే క్రికెట్‌లో సెంచరీ చేయడమే గొప్ప ఘనత.. అలాంటిది ఒకే ఇన్నింగ్స్‌లో 200 పరుగుల మార్కును అందుకోవడమంటే అసాధారణ ప్రదర్శనే. ఒకప్పుడు అసాధ్యమనుకున్న ఈ ఘనతను పురుషుల వన్డేల్లో తొలిసారి సచిన్ టెండూల్కర్ సుసాధ్యం చేస్తే.. ఆ తర్వాత భారత బ్యాటర్లు ద్విశతకాల పరంపరను కొనసాగించారు. ఇప్పటివరకు భారత్ తరఫున సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్ వన్డేల్లో డబుల్ సెంచరీలు నమోదు చేశారు.

**సచిన్‌తో మొదలు.. రోహిత్ హవా**

2010లో దక్షిణాఫ్రికాపై గ్వాలియర్‌లో సచిన్ టెండూల్కర్ అజేయంగా 200 పరుగులు చేసి పురుషుల వన్డేల్లో ద్విశతకం సాధించిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఏడాది తర్వాత 2011లో వెస్టిండీస్‌పై వీరేంద్ర సెహ్వాగ్ 149 బంతుల్లో 219 పరుగులు బాది అప్పటి అత్యధిక వ్యక్తిగత వన్డే స్కోరు రికార్డును తన పేరున రాసుకున్నాడు.

ఆ తర్వాత మొదలైంది రోహిత్ శర్మ 'డబుల్' దండయాత్ర. 2013లో ఆస్ట్రేలియాపై 209 పరుగులు చేసిన రోహిత్.. 2014లో శ్రీలంకపై ఏకంగా 264 పరుగులు బాదాడు. వన్డే క్రికెట్‌లో ఇప్పటికీ ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. 2017లో మరోసారి శ్రీలంకపైనే అజేయంగా 208 పరుగులు చేశాడు. దీంతో వన్డేల్లో మూడు ద్విశతకాలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. 2022లో బంగ్లాదేశ్‌పై ఇషాన్ కిషన్ 210 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. కేవలం 126 బంతుల్లోనే ద్విశతకం పూర్తి చేసి అప్పట్లో అత్యంత వేగంగా వన్డే డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు.

**ఇప్పుడు గిల్ 'డబుల్' జోరు**

2023లో న్యూజిలాండ్‌పై 208 పరుగులతో తన తొలి వన్డే ద్విశతకాన్ని నమోదు చేసిన శుభ్‌మన్ గిల్.. ఇప్పుడు వెస్టిండీస్‌పై మరోసారి 200 మార్కును దాటాడు. గువాహటిలో 406 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో 133 బంతుల్లో 26 ఫోర్లు, 8 సిక్సర్లతో అజేయంగా 223 పరుగులు చేసి భారత విజయానికి వెన్నెముకగా నిలిచాడు. దీంతో వన్డేల్లో ఒకటి కంటే ఎక్కువ ద్విశతకాలు సాధించిన భారత బ్యాటర్ల జాబితాలో రోహిత్ సరసన గిల్ చేరాడు. అయితే రోహిత్‌కు మూడు, గిల్‌కు రెండు ద్విశతకాలు ఉన్నాయి. కాబట్టి మీ కాపీలో ఉన్న 'రెండు డబుల్ సెంచరీలు సాధించిన రోహిత్ తర్వాత' అన్న వాక్యాన్ని లిలి'ఒకటి కంటే ఎక్కువ డబుల్ సెంచరీలు సాధించిన రోహిత్ తర్వాత రెండో భారత బ్యాటర్'లిలిగా మార్చడం సరైనది.

భారత ద్విశతక వీరులు: సచిన్ టెండూల్కర్-200 నాటౌట్, వీరేంద్ర సెహ్వాగ్-219, రోహిత్ శర్మ-209, 264, 208 నాటౌట్, ఇషాన్ కిషన్--210, శుభ్‌మన్ గిల్-208, 223 నాటౌట్.

# గ్రీకో రోమన్ రెజ్లింగ్ ఈవెంట్‌లో నితేశ్‌కు రజత పతకం

**నగోయా:** జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో ఇండియన్ రెజ్లర్ నితేశ్ సివాచ్ కు సిల్వర్ మెడల్ దక్కింది. 97 కేజీల గ్రీకో రోమన్ ఫైనల్లో ఇవాళ భారత రెజ్లర్ నితేశ్ ఓటమి పాలయ్యాడు. 0-4 పాయింట్ల తేడాతో అతను ఫైనల్లో జపాన్ ప్లేయర్ యూరి నకాజాటో చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. వాస్తవానికి నితేశ్ గట్టి పోటీ ఇచ్చాడు. గ్రిప్ కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ జపాన్ ప్లేయర్ ధీటుగా ఎదుర్కొన్నాడు. ఇండియన్ రెజ్లర్‌ను అటాక్ చేయకుండా అడ్డుకున్నాడు. దీంతో 0-4 తేడాతో నితేశ్ ఓడిపోయాడు. గ్రీకో రోమన్ స్టయిల్ రెజ్లింగ్‌లో గతంలో ఇండియాకు రెండు సార్లు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. 1962లో జకర్తాలో జరిగిన గేమ్స్‌లో 52కేజీల విభాగంలో మాల్వా సింగ్, 97 కేజీల విభాగంలో గణపత్ అండాల్కర్ స్వర్ణ పతకాలు గెలిచారు. ఇవాళ జరిగిన ఫైనల్లో నితేశ్‌ను స్కోరింగ్ చేయకుండా జపనీస్ ప్లేయర్ నిలువరించాడు. ఫస్ట్ బౌట్‌ను 2-0 తేడాతో నకాజాటో ముగించాడు. లోకల్ ఫేవరేట్ అయిన నకాజాటో సెకండ్ బౌట్‌లో విజయవంతంగా నితేశ్‌ను నేలకూల్చాడు. దీంతో అతనికి 4-0 ఆధిక్యం లభించింది. చివరి నిమిషంలో నితేశ్ అటాక్ చేసినా.. నకాజాటో తన డిఫెన్స్ టెక్నిక్‌తో అడ్డుకున్నాడు.





# ఐదేళ్ల ప్రేమకు హృతిక్ 'స్పెషల్ పోస్ట్'

### సబాతో బంధానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఫొటోలు పంచుకున్న బాలీవుడ్ స్టార్

### హృతిక్-సబా అనుబంధంపై మరోసారి అభిమానుల్లో ఆసక్తి

**ముంబై, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, నటి-గాయని సబా ఆజాద్ తమ అనుబంధంలో ఐదేళ్ల మైలురాయిని చేరుకున్నారు. ఈ సందర్భంగా సబాతో కలిసి గడిపిన మధుర క్షణాలకు సంబంధించిన ఫొటోలను హృతిక్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సరదా సెల్ఫీల నుంచి విహారయాత్రల వరకు తమ ప్రయాణంలోని ప్రత్యేక జ్ఞాపకాలను అభిమానులతో పంచుకోవడంతో ఈ పోస్టు వైరల్‌గా మారింది. ఫొటోల్లో హృతిక్, సబా సరదాగా సెల్ఫీలు దిగుతూ కనిపించగా.. సముద్రతీరంలో సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాలు, రెస్టారెంట్‌లో చేతులు పట్టుకుని కూర్చున్న క్షణాలు, విమాన ప్రయాణంలో ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అయితే హృతిక్ పోస్టుకంటే ఆయన మాజీ భార్య సుసాన్ ఖాన్ స్పందన మరింతగా నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. "చాలా స్వీట్.. హ్యాపీ యానివర్సరీ" అంటూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆమె కామెంట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. హృతిక్, సుసాన్ 2000లో వివాహం చేసుకోగా.. 2014లో విడాకులు తీసుకున్నారు. విడిపోయిన తర్వాత కూడా పిల్లల విషయంలో పరస్పర సహకారంతో కొనసాగుతున్నట్లు వారు గతంలో పలు



సందర్భాల్లో బహిరంగంగా కనిపించారు. హృతిక్, సబా కొన్నేళ్లుగా కలిసి కనిపిస్తూ తమ అనుబంధాన్ని బహిరంగంగానే కొనసాగిస్తున్నారు. హృతిక్ చివరిగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలోని 'వార్ 2'లో నటించారు. ఇందులో జూనియర్ ఎన్టీఆర్, కియారా అద్వానీ కీలక పాత్రలు పోషించారు. 'క్రిష్ 4'తో హృతిక్ దర్శకుడిగా అరంగేట్రం చేయనున్నట్లు 2025లో రాకేశ్ రోషన్ అధికారికంగా ప్రకటించారు. మీ కాపీలో ఉన్న 'క్రిష్ 3' స్థానంలో 'క్రిష్ 4' అని ఉండాలి. మరోవైపు సబా ఆజాద్ నటనతోపాటు సంగీత రంగంలోనూ కొనసాగుతున్నారు. ఆమె నటించిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'తోపాటు ఇతర ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకొచ్చాయి.

# 'జైలర్ 2'లో నోరా గ్లామర్ ధమాకా!





**చెన్నై, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న 'జైలర్ 2'లో గ్లామర్ హంగులు మరింత పెరగనున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నటి, డ్యాన్సర్ నోరా ఫతేహీతో ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించినట్లు సమాచారం. తెలుగు, హిందీ చిత్రాల్లో తన డ్యాన్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నోరా.. ఈ పాటతో తమిళ ప్రేక్షకులనూ ఆకట్టుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తెలుగులో 'టెంపర్'లోని 'ఇట్టాగే రెచ్చిపోదాం' పాట నోరాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత 'బాహుబలి', 'కిక్ 2', 'లోఫర్' తదితర చిత్రాల్లో ప్రత్యేక గీతాలతో సందడి చేసింది. హిందీలోనూ పలు హిట్ పాటలతో డ్యాన్సర్‌గా ప్రత్యేక క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల వరుణ్ తేజ్ 'మట్కా'లోనూ కీలక పాత్రలో కనిపించింది. తొలి 'జైలర్'లో తమన్నా చేసిన 'కావాలయ్యా' పాట సినిమా విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇప్పుడు రెండో భాగంలోనూ అలాంటి కమర్షియల్ ఆకర్షణ కలిగించే పాట ఉండాలనే ఉద్దేశంతో నోరాను రంగంలోకి దించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నటి పూర్ణతో ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించినట్లు సమాచారం ఉండగా, దానికి సంప్రదాయ శైలి ఎక్కువగా ఉండటంతో మరో గ్లామరస్ నంబర్‌ను నోరాతో రూపొందించినట్లు సినీవర్గాల కథనం. కొంతకాలంగా నోరా ప్రత్యేక గీతాల సంఖ్య తగ్గిన నేపథ్యంలో 'జైలర్ 2' ఆమెకు కీలక ప్రాజెక్టుగా మారే అవకాశం ఉంది. డ్యాన్స్, గ్లామర్‌తో తనకున్న ప్రత్యేకతను ఈ పాటలో మరోసారి చూపించినట్లు సమాచారం. అయితే పాటకు సంబంధించిన పూర్తి వివరాలు, విడుదల తేదీపై చిత్రబృందం నుంచి అధికారిక సమాచారం రావాల్సి ఉంది.







# కొత్త కోడలా.. ఇంట్లో దెయ్యమా?

### యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి' ట్రైలర్ విడుదల

### నవ్విస్తూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హారర్-కామెడీ

**ముంబై, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** ఇంట్లోకి కొత్త కోడలు వచ్చింది.. ఆమె అడుగుపెట్టగానే అప్పటివరకు గందరగోళంగా ఉన్న కుటుంబంలో ప్రశాంతత నెలకొంది. అంతా ఆమెను అదృష్టంగా భావిస్తుంటే.. ఒక్కరికి మాత్రం అనుమానం! కనిపిస్తున్నంత అమాయకురాలేనా?.. లేక ఆ నవ్వు వెనుక ఎవరికీ తెలియని భయంకరమైన రహస్యం ఉందా?.. ఈ ప్రశ్నలతో ఆసక్తి రేకెత్తిస్తోంది యామి గౌతమ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'నైయ్ నవెల్లి' ట్రైలర్. బాలాజీ మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్-కామెడీ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగనుంది. యామి గౌతమ్‌తోపాటు ఆదినాథ్ కోఠారే తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఓ సాధారణ కుటుంబంలోకి యామి కొత్త కోడలిగా అడుగుపెడుతుంది. అప్పటివరకు అస్తవ్యస్తంగా సాగుతున్న ఆ కుటుంబ జీవితాలు ఆమె రాకతో ఒక్కసారిగా గాడిలో పడతాయి. ఇంట్లో అందరూ ఆమెను అభిమానిస్తుండగా.. ఆదినాథ్ పోషిస్తున్న మరిది పాత్రకు మాత్రం ఆమె ప్రవర్తనపై అనుమానం మొదలవుతుంది. అక్కడి నుంచే కథ హారర్ మలుపు తీసుకుంటుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కొత్త కోడలు నిజంగానే కుటుంబానికి అదృష్టాన్ని తీసుకొచ్చిందా?.. లేక ఆమె వెనుక ఏదైనా అతీంద్రియ శక్తి, అంతుచిక్కని రహస్యం దాగి ఉందా? అనే ఉత్కంఠను ట్రైలర్ కొనసాగించింది. ఓవైపు కుటుంబ సభ్యుల మధ్య సన్నివేశాలతో నవ్వులు పంచుతూనే.. మరోవైపు భయపెట్టే దృశ్యాలతో ఆసక్తిని పెంచే ప్రయత్నం చేశారు. హారర్, కామెడీ అంశాలను మేళవిస్తూ కుటుంబ కథకు మిస్టరీని జోడించడం 'నైయ్ నవెల్లి' ప్రత్యేకతగా కనిపిస్తోంది. ముఖ్యంగా యామి పాత్ర చుట్టూ అసలు రహస్యాన్ని బయటపెట్టకుండా ట్రైలర్‌ను కట్ చేయడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దసరా సందర్భంగా అక్టోబర్ 16న చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

# 'కన్య' కాదని పెళ్లి రద్దు..

## అదే 'ఇంప్యూర్' కథ!

**హైదరాబాద్, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** పెళ్లి పీటలు సిద్ధమయ్యాయి.. రెండు కుటుంబాలు కొత్త బంధానికి సిద్ధమయ్యాయి. అంతలో పెళ్లికూతురు 'కన్య' కాదనే విషయం అత్తింటివారికి తెలుస్తుంది. అంతే.. పెళ్లి రద్దవుతుంది! అక్కడి నుంచి ఆ యువతి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది?.. ఆమె గతాన్ని ప్రశ్నించే సమాజానికి ఆమె సమాధానం ఏమిటి?.. ఇలాంటి సున్నితమైన అంశాన్ని కథావస్తువుగా తీసుకుని తెరకెక్కిన చిత్రమే 'ఇంప్యూర్'. కాకినాడలో జన్మించి అమెరికాలో పెరిగిన వారాహి మల్లిపాముల ఈ చిత్రంతో నటిగా, రచయిత్రిగా, నిర్మాతగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌లో సాంకేతిక రంగంలో పనిచేస్తూనే రాత్రిళ్లు, వారాంతాల్లో కథపై పనిచేసినట్లు వారాహి తెలిపారు. మహిళ జీవితాన్ని ఆమె లైంగిక గతం ఆధారంగా కొలిచే సామాజిక దృక్పథాన్ని ప్రశ్నించే ప్రయత్నమే ఈ సినిమా కథలో ప్రధానంగా కనిపిస్తోంది. మహిళా ప్రాధాన్య కథతో సినిమా నిర్మించేందుకు పలువురు నిర్మాతలను సంప్రదించినా ఆశించిన స్పందన రాలేదని వారాహి చెప్పారు. దీంతో చివరకు తానే నిర్మాతగా మారాల్సి వచ్చిందన్నారు. తన సినిమా కల కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాన్ని చూసిన తల్లి అండగా నిలిచిన తీరు గురించి వారాహి భావోద్వేగంగా వివరించారు. "మా చెల్లి పెళ్లికి ఖర్చు చేసినట్లే నీకూ డబ్బులు ఇస్తాను.. వాటిని నీ సినిమా కోసం పెట్టుకో అని అమ్మ చెప్పింది. అయితే ఆ మొత్తం కూడా సరిపోలేదు. అప్పులు చేయాల్సి వచ్చింది. అమెరికా నుంచి ఇక్కడికి వచ్చి నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి సినిమాను పూర్తి చేశాం" అని ఆమె పేర్కొన్నారు. పెళ్లికి ముందు మహిళ వ్యక్తిగత జీవితాన్ని 'పవిత్రత' అనే కొలమానంతో చూడటం, అదే ప్రమాణాన్ని పురుషులకు వర్తింపజేయకపోవడం వంటి ప్రశ్నలను సినిమా ఏ కోణంలో చర్చిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. బోల్డ్ కథాంశంతో వస్తున్న 'ఇంప్యూర్' ప్రేక్షకుల్లో ఎలాంటి చర్చకు దారితీస్తుందో చూడాలి.



"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**



# అండర్-17 రగ్బీ జట్ల ఎంపిక

**ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 200 మంది క్రీడాకారుల హాజరు**

**కాకినాడలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్లు**

**తాడేపల్లి, అక్టోబర్ 1 (స్పంద న్యూస్ ):** తాడేపల్లి కుంచనపల్లి సమీపంలోని అరవింద సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్--17 బాలబాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అరవింద పాఠశాల కరస్పాండెంట్ ఇంద్రాణి రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జిల్లా జట్లు దసరా సెలవుల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం పాఠశాల హెచ్ఎం ఎం. ఉమాశ్రీ, మారుతీ ఫౌండేషన్ చైర్మన్ జంగాల వెంకటేష్, మాజీ సర్పంచ్ షేక్ చినరంగ షరీఫ్, కాకుమాను జోజప్ప, గుంటూరు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సీహెచ్. వినయ్ కుమార్, పీడీలు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, డి. భాస్కరరావు, సీహెచ్. కొండయ్య, నాగమణి, మాదురి రాణి, హరికృష్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో గాంధీ జయంతి



**పెదనందిపాడు, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సత్యం, అహింస, స్వచ్ఛత, సేవ, సమానత్వం వంటి గాంధీజీ ఆశయాలను విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ సత్యం, అహింస మార్గాలను అనుసరించి ప్రజలను ఏకం చేసి స్వాతంత్ర్య సాధనకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. గాంధీజీ ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఒక ఆలోచనా విధానం, జీవన మార్గం, నైతిక శక్తి అని తెలిపారు. నేటి సమాజంలో కోపం, ద్వేషం, అసహనం పెరుగుతున్న నేపథ్యంలో అహింస, సహనం, పరస్పర గౌరవం ఎంతో అవసరమని అన్నారు. అన్యాయాన్ని ఎదుర్కొంటూనే ద్వేషానికి దూరంగా ఉండటమే నిజమైన అహింస అని వివరించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, విద్యార్థులు కేవలం ఉద్యోగం కోసం కాకుండా విలువలతో కూడిన జీవితాన్ని నిర్మించుకునేందుకు విద్యను అభ్యసించాలని సూచించారు. విద్య జ్ఞానాన్ని, విలువలు వ్యక్తిత్వాన్ని, సేవా భావం జీవితానికి అర్థాన్ని ఇస్తాయి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సత్యాన్ని ఆచరించడం, అహింసను పాటించడం, స్వచ్ఛతను కాపాడటం, ప్రకృతిని పరిరక్షించడం, ప్రతి మనిషిని గౌరవించడం, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావడం వంటి అంశాలపై సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి ఎస్ చెప్పండి

**విద్యార్థులకు పోలీసుల అవగాహన!**

**మచిలీపట్నం, అక్టోబర్ 01 (స్పంద న్యూస్):** మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళలు మరియు బాలికల భద్రతే లక్ష్యంగా విద్యార్థుల్లో చైతన్యం పెంచాలని కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో పోలీస్ శాఖ, ఈగిల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వి.వి. నాయుడు, బందరు డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ వి. వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ సీఐ చ. వెంకటేశ్వరరావు, ఈగిల్ ఆర్ఎస్ఐ పి. రాంబాబు, సీనియర్ న్యాయవాది ముసలయ్య, బందరు తాలూకా ఎస్ఐ రమేష్, శక్తి టీం సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. రేణుకాదేవి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ చట్టం-1985 ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే ఎదురయ్యే తీవ్ర చట్టపరమైన పరిణామాలను విద్యార్థులకు వివరించారు. "బ్రేక్ ది సైలెన్స్" సందేశంతో డ్రగ్స్ విష సంస్కృతిపై యువత నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను దాచకుండా సహాయం పొందాలని సూచించారు. దేశ భద్రతకు ముప్పుగా మారిన నార్కో టెర్రరిజాన్ని అరికట్టేందుకు ఈగిల్ టీమ్ పనిచేస్తోందని తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ఈగిల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆన్‌లైన్ ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ వేధింపుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. మహిళలు, బాలికల రక్షణకు ఉద్దేశించిన పోక్సో చట్టం, అత్యవసర పోలీస్ సేవలు 112, మహిళా హెల్ప్‌లైన్ 181 సేవలపై విస్తృత అవగాహన కల్పించారు. "డ్రగ్స్‌కు చీా చెప్పండి - జీవితానికి జూ చెప్పండి" అనే నినాదంతో ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకుని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు.




## చరిత్ర ప్రసిద్ధిగాంచిన నాగులేరు అభివృద్ధిపై దృష్టి సారించిన

# జూలకంటి బ్రహ్మానంద రెడ్డి

- నాగు లేరు వద్ద నిర్మించనున్న బ్రహ్మనాయుడు పార్కు పనులను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్న పంగులూరి పుల్లయ్య.

**కారంపూడి, అక్టోబర్ 1 (పలనాడు జిల్లా) స్పంద న్యూస్:** మండల కేంద్రమైన కారంపూడి లో చరిత్ర ప్రసిద్ధిగాంచిన నాగులేరు ను ఈ మధ్యకాలంలో దుర్గంధపు, మల్ల మూత్ర విసర్జన మురుగు కాలువగా కారంపూడి పట్టణ కొంతమంది వ్యాపారస్తులు ప్రజలు మార్చేశారు. పాదచారులకు, వాహనదారులకు నాగులేరు పై ప్రయాణం చేస్తున్న సమయంలో దుర్గంధం వెదజల్లుతూ దీనవస్థకు చేరిన నాగులేరుపై మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, వారి రాజకీయ వ్యక్తిగత కార్యదర్శి పగలూరి పుల్లయ్య దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలకు శాసనసభ్యులు బ్రహ్మానంద రెడ్డి చే పనులను ప్రారంభింపజేసి, మల,మూత్ర విసర్జనలకు శాశ్వత పరిష్కార దిశగా నాగులేరు వొడ్డున బ్రహ్మనాయుడు పేరుపై పార్కును నిర్మించి,నాగులేటి పరిశుభ్రతను, పవిత్రతను కాపాడేందుకు నడుంబిగించారు. మూడు రోజుల క్రితం మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన శాసనసభ్యులు బ్రహ్మానంద రెడ్డి నాగులేటి పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై కూడా దృష్టి సారించి, దానికి అనుగుణంగా పనులను చేపిస్తున్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్, పార్కులో కావలసిన అలంకారవంతమైన మొక్కలను, పార్కుకు వచ్చిన ప్రజలు విశ్రాంతి తీసుకునే విధంగా కావలసిన బల్లలను శాసనసభ్యుల రాజకీయ వ్యక్తిగత కార్యదర్శి పుంగలూరి పుల్లయ్య వ్యక్తిగతంగా అందిస్తున్నారు. పార్కులో పిల్లలు ఆడుకునేందుకు మరియు ఇతర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తూ కారంపూడి మండల అభివృద్ధి అధికారి ఘంటా శ్రీనివాసరెడ్డి పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. ఈ పనులన్నీ కూడా వీరుల గుడి వెనక ప్రాంతంలో జరుగుతూ ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను కూడా పర్యవేక్షిస్తున్నందున నాగులేరుకు కొంతవరకు పవిత్రతను చేకూర్చినట్లుగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగులేరు పై ఉన్న బ్రిడ్జికి ఉత్తరపు వైపున కూడా



మొదటిగా నాగులేరు కలుషితం అవ్వకుండా చిరు వ్యాపారులు తమ వ్యర్థాలను నాగులేటిలో వేయనీయకుండా వారిపై తగిన చర్యలు తీసుకుంటూ ఈ ప్రాంత అభివృద్ధిపై కూడా శాసనసభ్యులు బ్రహ్మానంద రెడ్డి, వారి రాజకీయ వ్యక్తిగత సెక్రెటరీ పంగులూరు పుల్లయ్య తన సొంత మండలం కారంపూడి అయినందున కారంపూడి మండల అభివృద్ధిపై కూడా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పుడు చేస్తున్న అభివృద్ధి పనులకు తోడుగా ఎన్ఎస్పి కాలువకు ఉన్న ఎస్కేప్ ఛానల్ కు లాకులు బిగించే విధంగా చర్యలు తీసుకొని, నాగులేటిలో నిత్యం నీరు పారేలా చేసి నాగులేరు దిగువ ప్రాంత గ్రామాల వారికి త్రాగు, సాగు నీరు అందించే విధంగాను, అలాగే ఎస్కేప్ ఛానల్ ద్వారా నీటిని నాగులేటికి విడుదల చేయించి, నీరు అందుబాటులో లేక మూతపడి ఉన్న సన్నిగండ్ల లిఫ్ట్ ఇరిగేషన్ను కూడా మరల ప్రారంభించి, ఆ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగుబడి కానున్న మాగాణి కానీ,ఆరుతడి పంటలు పండించే మొత్తం వేయ ఎకరాల పైర్లకు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవలసినదిగా మండల ప్రజలు కోరుతున్నారు.

# బుర్రిపాలెంలో సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

**మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపు!**

**తెనాలి, అక్టోబర్ 01 (స్పంద న్యూస్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 4వ తేదీన చేపట్టనున్న బుర్రిపాలెం పర్యటనను అత్యంత విజయవంతం చేసేందుకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారిగా తెనాలి నియోజకవర్గానికి వస్తున్నందున ఈ పర్యటనకు ఎంతో ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ విధానంలో సుమారు 100 గృహాల నిర్మాణానికి సంబంధించి చేపడుతున్న పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రితో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్



యోజన గ్రామీణ్ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 3 లక్షల ఇళ్లను కేటాయించిందని వెల్లడించారు. ఇందులో భాగంగానే బుర్రిపాలెంలో అత్యాధునిక 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో 100 ఇళ్ల నిర్మాణాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ నూతన సాంకేతిక నిర్మాణాలు, ప్రభుత్వం అందిస్తున్న సహాయం, లబ్ధిదారులకు చేకూరే సంక్షేమ ప్రయోజనాలపై జనసేన శ్రేణులు విస్తృత అవగాహన పెంచుకొని ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని సూచించారు. రాజకీయాల్లో క్రమశిక్షణతో పాటు నిరంతర ప్రజాసేవ అత్యంత కీలకమని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ సమాజ హితం కోసం శ్రమించాలని కోరారు. బుర్రిపాలెం గ్రామానికి వెళ్లే మార్గం సింగిల్ రోడ్డు కావడం వల్ల ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండే అవకాశం ఉందన్న మంత్రి, తెనాలి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాల నుండి కార్యకర్తలు ముందుగానే బయలుదేరి ఉదయం 10 గంటలకల్లా చేరుకునేలా ప్రణాళిక చేసుకోవాలని ఆదేశించారు. జనసేన పార్టీ జెండాలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చి కూటమి ప్రభుత్వంలో పార్టీ భాగస్వామ్యాన్ని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. బుర్రిపాలెం పర్యటనను దిగ్విజయం చేయడం మనందరి ఉమ్మడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు మరియు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# మంగళగిరి వైసీపీ సమన్వయకర్తగా వేణుగోపాల సోమిరెడ్డి

**ఘనంగా బాధ్యతల స్వీకారం.. పార్టీ శ్రేణులతో సమావేశం**

**స్థానిక సమస్యలపై పోరాడతాం.. కార్యకర్తలకు అండగా ఉంటాం: సోమిరెడ్డి**

**మంగళగిరి, అక్టోబర్ 1 (స్పంద న్యూస్ ):** మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్తగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధిష్ఠానం ఆయనను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన విషయం తెలిసిందే. బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డితో పాటు నియోజకవర్గ నాయకులు, మండల అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లోకి వెళ్లి వివరిస్తామని అన్నారు. డీఎస్సీ పోస్టులు, మెడికల్ కాలేజీల అంశాల్లో తమ పార్టీ తరఫున పోరాటం చేశామని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజల పక్షాన పోరాడుతామని






తెలిపారు. రాబోయే స్థానిక, మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని సోమిరెడ్డి చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు నూతన సమన్వయకర్తకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ సమన్వయకర్త వేమారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
శుక్రవారం, 2 అక్టోబర్ 2026

# శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యం



- ఫింగర్‌ప్రింట్, క్లూస్ టీం, ఎంసీయూ విభాగాలను తనిఖీ చేసిన కృష్ణా జిల్లా ఎస్పీ
- నేర నిరూపణలో ఆధారాల భద్రత కీలకం: ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

**కృష్ణా జిల్లా, అక్టోబర్ 1 (స్పంద న్యూస్ ):** నేరాల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణ, వాటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ సూచించారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడుతో కలిసి ఫింగర్‌ప్రింట్, క్లూస్ టీం, మెజర్‌మెంట్ కలెక్షన్ యూనిట్ (ఎంసీయూ) విభాగాలను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది విధులు, రికార్డుల నిర్వహణ, పరికరాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనుమానితులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, వలస వచ్చిన వారి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి, అవసరమైన ఫింగర్‌ప్రింట్ రికార్డులను భద్రపరచాలని ఆదేశించారు. నేరస్థలాల్లో లభించే ప్రతి ఆధారాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో జాగ్రత్తగా సేకరించి, ఎలాంటి నష్టం జరగకుండా భద్రపరచాలని సూచించారు. సేకరించిన ఆధారాల రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ దర్యాప్తు అధికారులకు అవసరమైనప్పుడు తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్ కేసులకు సంబంధించిన ఫింగర్‌ప్రింట్, క్లూస్ నివేదికలను త్వరితగతిన పూర్తి చేసి దర్యాప్తుకు సహకరించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను సమర్థవంతంగా వినియోగిస్తూ సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలపై ఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాలు కీలకమని, నేర నిరూపణకు ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతతో, సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బందరు డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సత్య కిషోర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. వెంకటేశ్వరరావు, ఫింగర్‌ప్రింట్, క్లూస్ టీం ఎస్ఐ త్రివర్ణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 8,550 కిలోల బియ్యం పట్టివేత



**పొన్నూరు, అక్టోబర్ 1 (స్పంద న్యూస్):** పొన్నూరు పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసిన రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన పోలీసులు 171 బస్తాల్లో ఉన్న మొత్తం 8,550 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో ఎస్‌బీ డీఎస్పీ, టాస్క్‌ఫోర్స్ సీఐల ఆదేశాల మేరకు పొన్నూరు టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి టాస్క్‌ఫోర్స్ బృందం శాంతినగర్ 2వ లైనులోని వీరయ్య స్టోర్ నంబర్ 13 వద్ద ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఆ సమయంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఏపీ 39 డబ్ల్యూఎన్ 5746 నంబరు గల బడా దోస్త్ వాహనంలోకి లోడ్ చేస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే సదరు వాహనాన్ని తనిఖీ చేసి 50 కిలోల చొప్పున ఉన్న 171 బియ్యం బస్తాలను సీజ్ చేశారు. ఈ అక్రమ రవాణా వ్యవహారంలో ప్యాపర్రు గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ బి. సుదీర్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 8,550 కిలోల బియ్యంతో పాటు బడా దోస్త్ వాహనం, రెండు స్కూటీలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనాలు, నిందితులను తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం పొన్నూరు టౌన్ పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

# గ్రామాల్లో శాంతిభద్రతలే పల్లెనిద్ర లక్ష్యం

తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి



**తాడేపల్లి అక్టోబర్ 1(స్పంద న్యూస్ ):** గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు రాత్రివేళ ప్రజలకు భద్రత కల్పించడమే పల్లెనిద్ర కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ పర్యవేక్షణలో, తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం రాత్రి మెల్లెంపూడి గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ.. గ్రామాల్లో రాత్రి వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రాత్రి సమయంలో పోలీసుల పర్యవేక్షణ కొనసాగించడం ద్వారా ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం లభిస్తుందని ఎస్ఐ తెలిపారు. ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ ఖాజావలి సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు పోలీసులకు సహకరించడం ద్వారా గ్రామాల్లో నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. పల్లెనిద్రలో భాగంగా పోలీసులు గ్రామంలో రాత్రివేళ పర్యటిస్తూ పరిస్థితులను పరిశీలించారు. ప్రధాన కూడళ్లు, ప్రజలు సంచరించే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటం, నేరాల నియంత్రణకు ప్రజల సహకారం పొందడం పల్లెనిద్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎస్ఐ ఖాజావలి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

జాతీయ బిసి బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు



**చిలకలూరిపేట అక్టోబర్ 1 :** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్స్ అమలకై ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 105,1065ను మొత్తం రిజర్వేషన్స్ 59 శాతానికి మించకూడదన్న ఏపీ హైకోర్టు ధర్మాసనం కొట్టి వేయటం రాజ్యాంగ స్ఫూర్తికి సహజ న్యాయ సూత్రానికి విరుద్ధంఅని జాతీయ బిసి బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు అన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా తమిళనాడులో ఏ విధముగా 69% రిజర్వేషన్లు అమలు జరుగుతున్న విధముగా ఏపీలో కూడా రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్స్ అమలు చేయాలని నరసింహారావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కోసం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టేందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై ఒత్తిడి తేవాలని, ఏపీ నుండి ఒక ప్రతినిధి బృందాన్ని నరేంద్ర మోడీ వద్దకు ఢిల్లీ పంపి యుద్ధ ప్రాతిపదికన రాజ్యాంగ చేయించి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సీఎంచంద్రబాబు కృషిచేయాలని తాటికొండ నరసింహారావు విజ్ఞప్తి చేశారు. నేడు గుంటూరు లొ ఏర్పాటు చేసిన సమావేశంలొ పాల్గొన్న వారిలో అద్దంకి రవి కె భతేశ్వరావు వై లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారి




**యడ్లపాడు అక్టోబర్ 1 స్పంద న్యూస్ :** మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామపంచాయతీ పరిధిలోని బోయపాలెం గ్రామం లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ పి . భరద్వాజ, వైద్యాధికారి సందర్శించినారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గురుకుల పాఠశాలలో అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వారికి ఉన్న అనారోగ్య సమస్యలకు తగిన చికిత్స మరియు మందులు అందించినారు. విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, భోజనం ముందు చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, సరియైన పోషకాహారం తీసుకొనుట, ఏదైనా అనారోగ్యం ఉన్న యెడల వెంటనే తగు చికిత్స పొందుట గురించి తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్.ఎస్ పున్నారావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డి .భారవి, ఎంఎల్ హెచ్ పి.ఎం .శివ నాగలక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొని తమ ఆరోగ్య సేవలు విద్యార్థులకు అందించినారు.

# బడుగు బలహీన వర్గాల ముఖాలలో చిరునవ్వులే కుటమి ప్రభుత్వ లక్ష్యం

**చిలకలూరిపేట అక్టోబర్ 1 (స్పంద న్యూస్) :** పేద, బడుగు, బలహీన వర్గాల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తు,ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఒకటో తేదీనే అర్హులైన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా పింఛన్ అందిస్తూ నిజమైన ప్రజా సంక్షేమాన్ని చేకూరుస్తున్నార ని, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, నియోజకవర్గ ప్రగతికి, పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచనలతో నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెం గ్రామంలోఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణ చంద్రరావు పాల్గొనినేరుగా లబ్ధిదారుల గడప వద్దకే వెళ్లి, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ సొమ్మును అందజేశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణ చంద్రరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# హెచ్‌పీవీ టీకాపై అవగాహన కార్యక్రమం




**యడ్లపాడు అక్టోబర్ 1 (స్పంద న్యూస్) :** యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉన్నవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌పీవీ టీకా గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన భారత దేశంలో నమోదు అవుతున్న గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసుల గురించి, క్యాన్సర్ వలన మరణించే వారి సంఖ్య గురించి, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌కు ముఖ్య కారణమైన హ్యూమన్ పాపిల్లోమ వైరస్ (హెచ్‌పీవీ) ఇన్ఫెక్షన్ గురించి, హెచ్‌పీవీ టీకా గురించి విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ పి భరద్వాజ వివరించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ టీకా కార్యక్రమం ఫిబ్రవరి 28 వ తేదీన దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఇప్పటి వరకు ఎడ్లపాడు మండలం లో 321 మందికి వేయడం జరిగింది. ప్రస్తుతం వేస్తున్న టీకా పేరు గార్డసిల్ -4 . ఈ టీకా గత 18 సంవత్సరాల నుండి ప్రైవేట్ రంగంలో అందుబాటులో ఉన్నా ఈ సంవత్సరం ఫిబ్రవరి 28 నుండి జాతీయ వ్యాధి నిరోధక టీకాల షెడ్యూలు లో సమకూర్చారు. ఈ టీకా 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15 వ సంవత్సరం లో ఉన్న ఆడ పిల్లలకు మాత్రమే వేయడం జరుగుతుంది. కనుక 14 సంవత్సరాలు నిండి 15 వ సంవత్సరం జరుగుతున్న ఆడ పిల్లలు అందరికీ ఈ హెచ్ పి వి టీకా తప్పని సరిగా వేయించుకుని భవిష్యత్తు లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడకుండా తమను తాము కాపాడుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా పి. భరద్వాజ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్. పున్నారావు ,పబ్లిక్ హెల్త్ నర్స్ యన్. రాజేశ్వరి దేవి , డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డి భార్గవి , యమ్ ఎల్ హెచ్ పి లు, ఏ యన్ యం, ఆశా కార్యకర్తలు, మండల విద్యాధికారి, ఎడ్లపాడు , ఉన్నవ హై స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.